ప్రజాశక్తి

Vol. 6, no. 1

(Jan. 3, 1945)

బెజవాడ, 1945

Record no. 683

Prajāśakti

Vol. 6, no. 1

(Jan. 3, 1945)

Bejavāḍa, 1945

Record no. 683

Regd. No M. 4486 0-2-0

ప్రజాశక్తి

సంపుటి 6 బుధవారం 3-1-45 సంచిక 1

★ మనరాజకీయాలు

వైస్రాయి నడమంత్రపు వైద్యం

— మద్దుకూరి చంద్రశేఖరరావు

క్రలకత్తాలో జరిగిన బ్రిటిషువర్తకులసభలో రాజప్రతినిధి వేవెల్ ఉపన్యసించాడు. వైస్రాయి వుపన్యాసం నిజంగా భారతదేశానికొక సవాలు. అతని వాక్కుల్లో విజయోన్మాదం కన్పించుతోంది. యుద్ధాన్ని గెలుస్తున్నామనీ, ఆర్థిక సంక్షోభాన్ని చక్కపెట్టామనీ, యింక తాము చేయవలసిందేమీలేదని వైస్రాయి చంకలెగురవేస్తున్నాడు.

ఈ అల్పసంతోషంలో వైస్రాయి రాజదండం వదలి నాటువైద్యుడయ్యాడు. నడుమంత్రపు సలహాలు యివ్వడానికి పూనుకున్నాడు. చూడండి ! అతని మాటలు !

"బ్రిటను ఇండియాలమధ్య నిజమైన అభిప్రాయభేదాలున్నాయని నేను విశ్వసించడంలేదు........

"ఆరోగ్యం తిరిగిపొందాలంటే విశ్వాసం - బ్రిటీషు ప్రజల సదుద్దేశాలయెడ విశ్వాసం - అనే మందును సేవించాలి." అని ఉపదేశాలు చేశాడు వేవెల్ప్రభువు !

బ్రిటీషు ప్రజలంటే ఎవరు ?

కాని ఒక్క సూటి ప్రశ్నవేస్తే వేవెల వాయించుతున్న సన్నాయి అపశ్రుతి బయటపడుతుంది. బ్రిటీషు ప్రజలంటే ఎవరు ? వైస్రాయి యిచట కలకత్తాలో బ్రిటీషుకోటీశ్వరుల ఎదుట పలుకుతున్న సమయంలోనే అచట లండన్‌నగరంలో జరుగుతున్న బ్రిటీషు కార్మికుల పార్టీమహాసభ ఏమని తీర్మానించిందో చూడండి ! జాతీయనాయకులను విడుదల చేయండి : ప్రతిష్టంభన తొలగించి జాతీయప్రభుత్వం స్థాపించండని ఎలుగెత్తి చాటారు. కాని కర్మాగారంలో చెమటోడ్చి పనిచేస్తూ, యుద్ధరంగంలో నాజీలను హతమార్చడానికి సర్వస్వం అర్పిస్తూన్న బ్రిటిష్‌ప్రజలు కాదు వేవెల్‌దృష్టిలో వుంది ! మాటికి ఒకరుమాత్రమేవున్న వర్తకులు, ధనస్వాములు, సామ్రాజ్యవాదులు, చర్చిల్, అమెరి అండ్ కంపెనీనే వేవెల్ బ్రిటీషుప్రజలు పేరుతో పిలుస్తున్నాడు.

భారత స్వాతంత్ర్యకాంక్షను బలపరుస్తున్న సోదర బ్రిటీషు ప్రజలపై భారతీయులకు సంపూర్ణ విశ్వాసముంది. కాని బ్రిటీషు సామ్రాజ్యవాదులపైన, అమెరీ అండ్ చర్చిల్ కంపెనీ పైన మాత్రమే విశ్వాసంలేదు.

'శస్త్ర చికిత్స వద్దట'

పాపం ! వైస్రాయికి భారతదేశంపై ఎంత దయో చూడండి. "పెద్ద శస్త్రచికిత్స (సర్జికల్ ఆపరేషన్)" అనవసరమట. "ఈ విశాలమైన భూమిలో సంపూర్ణ సౌఖ్యాన్ని స్థాపించడానికి" శస్త్రచికిత్స అడ్డువస్తుందని బెదిరించుతున్నాడు. దీని అర్థం ఏమిటి ?

రాజప్రతినిధి స్పష్టంగా పాకిస్థాన్‌కు వ్యతిరేకతను వెల్లడించాడు. అఖండహిందూస్థానమే తమకభిమతమని హిందువులను దువ్వుతున్నాడు. తమమీద అనగా బ్రిటీషుసామ్రాజ్యవాదులమీద విశ్వాస ముంచండంటున్నాడు. "భావి రాజ్యాంగ విధానం ఎలావున్నాసరే, గత 60 సంవత్సరాల అనుభవాన్ని బట్టి దేశరక్షణకు తగిన ఏర్పాట్లు చేయబడుతాయి." అని నమ్మబలుకుతున్నాడు. దీనిభావం ఏమిటి ? ముస్లింలీగ్ విభజన కోరుతూంటే అది భారతదేశరక్షణకు ప్రమాదమేమోనని గాంధీజీ సందేహం వెల్లడించాడుగదా ! దానికి సమాధానమే వైస్రాయి సూచనలు. పైగా "భారతనాయకులు యీ విషయమై లోతుగా ఆలోచించుకోవలసింద"ని సలహా యిచ్చాడు.

చూచారా ! వైస్రాయి రాజకీయ ఎత్తు. ఒకవైపున ముస్లింలీగ్ కోరిన పాకిస్థాన్ యివ్వనన్నాడు. కాంగ్రెసు - లీగ్‌లమధ్య చీలికలను ప్రోత్సహించాడు. రెండోవైపున కాంగ్రెసుకోరే జాతీయప్రభుత్వం నిరాకరించాడు. ఇష్టమైతే ప్రస్తుత రాజ్యాంగప్రణాళిక క్రిందనే పనిచేయమని ఆహ్వానించాడు.

కాంగ్రెసువాదులు వైస్రాయి ఎత్తులను అర్థంచేసికోవాలి. ప్రధాన రాజకీయపార్టీలైన కాంగ్రెసు - లీగ్ యొక్క వాంఛలను నిరాకరించగల ధైర్యం, అహంకారం ఎచటనుంచి వచ్చింది వైస్రాయికి ?

గెలిచేదెవరు ?

కొందరు దేశభక్తులు మిత్రరాజ్యాల విజయం వల్లనే బ్రిటీషు సామ్రాజ్యవాదులు యింకా బింకం వహించుతున్నారని నిస్పృహ చెందుతున్నారు. కాని వాస్తవమేమిటి? మిత్రమండలి జయించుతున్నమాట నిజమే. అనగా ఫాసిస్టు దురంతకులను ప్రపంచప్రజలు ఓడించుతున్నారు. సామ్రాజ్యవాదులు గెలవడంలేదు. ఆక్రమితదేశాల ప్రజలు స్వతంత్రులవుతున్నారు. ఆయాదేశాల ప్రజలపై పెత్తనం బామకుందామని యత్నించుతున్న బ్రిటిషు సామ్రాజ్యవాదులు ఓడిపోతున్నారు.

ఉదాహరణకు ఫ్రాంసులో చూడండి ! ఫ్రెంచి ప్రజల అభిప్రాయానికి లొంగి, చర్చిల్ ప్రధాని డీగాలీ ప్రభుత్వాన్ని అంగీకరించలేదా ? సామ్రాజ్యవాదుల ఏజంటయిన పోలిష్ హోటల్ ప్రభుత్వానికి తిలోదకాలొసగి పోలెండు లిబరేషన్ కమిటీ సూచనలను చర్చిల్ అంగీకరించ సిద్ధపడలేదా ? బెల్జియం ప్రజాభిప్రాయాన్ని తృణీకరించి, నాజీలను దేశంనుండి తరిమిన దేశభక్తులను నిరాయుధులనుచేసి తన్నులు తినుటలేదా? గ్రీసురాజును ప్రజలనెత్తిని రుద్దనెంచిన చర్చిల్ పాదాక్రాంతుడై, ఈడెన్‌తోసహా గ్రీకుదేశభక్తులతో రాయబారాలు జరుపడానికి వెంచేయలేదా ?

ఫాసిస్టు హంతకులతో పోరాడుతూన్న ప్రజలు ఐకమత్యంలో తమశక్తిని ప్రదర్శించినపుడల్లా ఈయుద్ధకాలంలో బ్రిటిష్ సామ్రాజ్యవాదుల నాయకుడు చర్చిల్ ధైర్యంగా వెనుకంజవేయక తప్పడంలేదు.

నాజీల చెరనుండి విముక్తినొందిన ప్రజలకు వ్యతిరేకంగా చేసే చర్చిల్ చేష్టలను బ్రిటిషు ప్రజలు నిరశించారు. అలాగే ఇండియాలో అమలుజరుపుతున్న చర్చిల్ రాజనీతిని ఆక్షేపించారు. రెండిటి విషయంలోను బ్రిటిషు కార్మికులు ప్రజాస్వాతంత్ర్యోద్యమాలను బలపరిచారు; అండగా నిలబడ్డారు. యూరపులో ప్రజలు జయంపొందుతున్నారు. చర్చిల్ ఓడిపోతున్నాడు.

మనం గెలిచేదెలా ?

భారతదేశంలోకూడ అంతే. భారతదేశభక్తులు ఐకమత్యంతో కృషిచేస్తే, ప్రపంచప్రజల స్వాతంత్ర్యోద్యమంలో భాగంగా వారికితోడుగా నిలబడితే, మనం గెలచితీరుతాము; చర్చిల్ ఓడిపోతాడు. కొందరు భ్రమపడుతున్నట్లుగా బ్రిటిషు సామ్రాజ్యవాదులు నేడు బలంగాలేరు. వాళ్ళు ఏకాకులుగా ఉన్నారు. భారతీయులలో ఎవరూ వారికి నేడు అండగా లేరు. చివరకు సంస్థానాధిపతులుకూడా ఎదురుతిరిగి నరేంద్రమండలికి రాజీనామా యిచ్చేరంటే సామ్రాజ్యవాదులు ఎంత బలహీనమయిందీ బోధపడుతుంది.

మనం ఏకంగాకపోవడమే మన ప్రధాన బలహీనత. కాంగ్రెసు, ముస్లిం-లీగ్, కమ్యూనిస్టుపార్టీ వగైరా పార్టీలకు చెందిన దేశభక్తులంతా ఏకమైతే మన దేశభవిష్యత్తును మనమే నిర్ణయించుకోగలుగుతాము. బ్రిటీషు ప్రజల, ప్రపంచ ప్రజల సాయంతో మనం జయించితీరుతాము. చర్చిల్, వేవెల్ తోకముడిచి వెనుకంజ వేయవలసి వస్తుంది. మనం ప్రజల విశ్వాసాన్ని చూరగొన్న కాంగ్రెసు - లీగు నాయకులతోగూడిన జాతీయప్రభుత్వాన్ని స్థాపించుకోగల్గుతాము.

★ సంపాదకీయం

ఉరికంబాలనుండి రక్షించాలి

"చీమూరు, అస్తి" అనేవి మధ్యరాష్ట్రంలోని గ్రామాలు. 1942 ఆగస్టు ఘటనల అనంతరం వాటి పేర్లు భారతదేశమంతటా మార్మోగాయి. పోలీసులమధ్య, ఉద్రిక్తులైన ప్రజలమధ్య జరిగిన పోరాటంలో రెండువైపులా కొందరు చనిపోయారు. ప్రభుత్వం తీవ్ర నిర్బంధచర్యలు జరిపి 'శాంతి' నెలకొల్పింది. అనేకమంది ప్రజలపై కేసులు పెట్టింది.

ఈ కేసులసందర్భంలో హైకోర్టులో 16 మందిపై వురిశిక్ష ఖాయంచేశారు. తీర్పుసమయంలో బ్రిటీషు జడ్జీలకు భారతీయ జడ్జీలకు విభేదాలొచ్చాయి. జస్టిస్ పురానిక్‌గారు సాక్ష్యం నమ్మతగినదిగాలేదనీ, ముద్దాయిలను శిక్షించకూడదనీ అభిప్రాయపడ్డారు.

ముద్దాయిలను రక్షించడానికి దేశమంతటా ఆందోళన జరుగుతోంది. మునిసిపాలిటీలు, ప్లీడర్లసంఘాలు, అన్నిపార్టీలు వురిశిక్షలను రద్దుచేయాలని ఆందోళన చేస్తున్నాయి : ప్రముఖులనేకమంది వైస్రాయి, గవర్నరువద్దకు రాయబారాలు వెళుతున్నారు. వేయిమాటలేల ? చనిపోయిన పోలీసు ఉద్యోగుల బంధువులు, తల్లులు సైతం ముద్దాయిలను ఉరికంబాలనుండి రక్షించాలనే విన్నపంపై సంతకాలు చేశారు. అంటే ప్రజా హృదయం ఏమి కోరుతూందో వేరే తెలియజేయనక్కరలేదు.

'చీమూరు, అస్తి' కేసుల వంటివి 1942 ఆగస్టు తర్వాత అనేకం జరిగాయి. ఈ మధ్యనే ధానాపూర్ కేసులో ముగ్గురికి వురిశిక్ష, 16 మందికి యావజ్జీవ ద్వీపాంతవాసం విధించబడ్డాయి. ఈ విషయంలో మనమిక జాగుచేయకూడదు. ఉరి కంబాలనుండి మన సోదరులను రక్షించుకోడానికి ప్రజలందరం తీవ్రకృషి చేయాలి.

1942 ఆగస్టు అల్లరుల సందర్భంలో శిక్షించబడినవారిని ఉరితీయవద్దని మేము ప్రభుత్వాన్ని కోరుతున్నాము. ఇవి క్రిమినల్ నేరాలవంటివి కావు. జాతీయనాయకులను ఆకస్మికంగా అరెస్టు చేయడం వల్ల ఉద్రిక్తులై ప్రజలుచేసిన పనులకు ప్రభుత్వం కొందరిని ఉరికంబాల కంపడం న్యాయంకాదు.

భారత ప్రజాభిప్రాయం దీనికి పూర్తిగా వ్యతిరేకమని ప్రభుత్వం గ్రహించాలి. బ్రిటను - భారతదేశాల మధ్యవున్న అగాధాన్ని యీ రక్తప్రవాహం ద్వారా మరింత ఎక్కువ చేయవద్దని హెచ్చరించుతున్నాం. భారత ప్రజాహృదయాల్ని వేధించుతున్న ఉరికంబాల దృశ్యం తొలగించి రెండుదేశాలమధ్య సుహృద్భావం కలుగునట్లుచూచుట ప్రభుత్వబాధ్యత అని స్పష్టపరుస్తున్నాము.

యావన్మంది భారతీయులు, పత్రికలు మరింత ఆందోళనజరిపి శిక్షితులను ఉరికంబాలనుండి రక్షించాలని మరొకసారి విన్నవించుతున్నాము.

చెరుకునకు న్యాయమైనధర నిర్ణయించాలి

చెరుకుపంటదార్ల ఆందోళన

10-12-44 వ తేదీని రామచంద్రపురం తాలూకా రామవరం గ్రామంలో ఆంధ్రరాష్ట్ర రైతుసంఘ ప్రధానకార్యదర్శి నండూరి ప్రసాదరావుగారి అధ్యక్షతను తూర్పుగోదావరిజిల్లా చెరుకు ఉత్పత్తిదారుల, వర్తకుల మహాసభ జరిగింది. శ్రీ నరసింహదేవర సత్యనారాయణగారు సభను ప్రారంభిస్తూ, "నేడు రాష్ట్రంలో ఎడ్వైజరీ పరిపాలన సాగుతూంది. వీరు రైతుల కష్టసుఖాలను గమనించకుండా ధరలు నిర్ణయిస్తారు. బెల్లం ధరలను పెంచేవిషయములో సివిల్ సప్లయిస్ డిపార్టుమెంటుతో మాట్లాడితే వినిపించుకోలేదు. కాబట్టి రైతులందరును తమ సంఘాలను ఏర్పరచుకొని తీవ్రమైన ఆందోళన చేయాలి. మనకు ఎడ్వైజర్ల పరిపాలన పోయి జాతీయప్రభుత్వమొచ్చేవరకు ఆందోళన చేస్తూ ఉండాలి" అని ఉపన్యసించారు.

నండూరి ప్రసాదరావుగారు తమ అధ్యక్షోపన్యాసంలో ఈ విధంగా చెప్పారు. "నేటి యుద్ధపరిస్థితులలో ప్రతి వస్తువుకు ఉత్పత్తి, పంపకం, ధరల విషయాలలో కంట్రోలు అవసరమే. కాని యిది ఉత్పత్తిదారులకు కూడ సంతృప్తికరముగా వుండాలి. చెరుకుకు, బెల్లముకు ధరలు నిర్ణయించుటలో రైతులకు చాల అన్యాయము జరిగింది. లక్షలకొలది రూపాయలను పంచదారమిల్లులు లాభాలు తీస్తుండగానే, చెరుకు ఉత్పత్తికే టన్ను 1కి రు 22-8-0 అవుతూఉంటే, ప్రభుత్వం గత సంవత్సరం 18 రూపాయలనే నిర్ణయించింది. ఈ సంవత్సరం 25 రూపాయల వరకు ఉత్పత్తి ఖర్చులుంటే 21 రూపాయల నుండి 23 వరకు నిర్ణయించింది. పైగా మిల్లు ఏరియాలో బెల్లం ఆడకూడదని నిషేధించుటతో తుమ్మపాల, కిర్లంపూడి మిల్లు ఏరియాలలోని రైతులు చెరకును పూర్తిగా మిల్లులు తీసుకొనకపోవుటచే అనేక వేల టన్నుల చెరుకు ఎండిపోయినది. కాబట్టి ప్రభుత్వం తన అవకతవక పద్ధతులను మానుకొనేటట్లు రైతులు పోరాడాలి. బెల్లమునకు చెరుకునకు రాష్ట్రరైతుసంఘం కోరినట్లు న్యాయమైనధర నిర్ణయించాలి. పిమ్మట చెరుకు రైతులకోర్కెలు తెలుపుతూ తీర్మానాలు చేయబడ్డాయి. వాటిని ప్రభుత్వానికి తెలియజేయడానికి రాయబారవర్గం ఎన్నుకోబడింది.

17-12-44 సాయంత్రం 5 గంటలకు అనకాపల్లిలో శ్రీ యన్. నరసింహమూర్తిగారి అధ్యక్షతను బెల్లం ఉత్పత్తిదార్లు, చెరుకు పండించే రయితులు, బెల్లం వర్తకులసభ జరిగింది. సభలో ఆంధ్రరాష్ట్రరైతుసంఘ కార్యదర్శి శ్రీ నండూరి ప్రసాదరావుగారు ఉపన్యసించారు. సభకు తాలూకాలో వివిధ గ్రామాలనుండి రయితులు, వర్తకులువచ్చారు.

సభలో శ్రీ నండూరి ప్రసాదరావుగారు ప్రస్తుతం ఎగుమతి సౌకర్యాలు లేనందున బెల్లం చెలామణికాక పాడగుటయూ, అవసరమున్న ప్రాంతాలలో ప్రజలు బెల్లంలేక బాధపడడం జరుగుతుందనియూ, రైతులకు అతి ముఖ్యమయిన పనిముట్లు, బండిపట్టాలు, ఇనుపరేకులు లేనందున వ్యవసాయపుపాటు కుంటుపడుచున్నదనియూ, చెరుకు ధర, రయితుల యుత్పత్తి ఖర్చులు ఆలోచించక నిర్ణయించుటవలన రైతులు మరీ నష్టమునకు గురియగుచున్నారనియూ ఉపన్యసించారు. పిమ్మట యీ దిగువ తీర్మానములు సభలో చేయబడినవి.

(1) గతసంవత్సరం విడిచిపెట్టబడ్డ చెరుకుకు నష్టపరిహారం యివ్వాలి.

(2) ఈసంవత్సరం ఫ్యాక్టరీకి కావలసిన చెరుకును మినహాయించి మిగతా చెరుకుకు రిలీజు ఆర్డర్లు వెంటనే యివ్వాలి.

(3) తుమ్మపాల ఏరియాలో వెంటనే జాయింటు కమిటీ ఏర్పరచాలి.

(4) మణుగుబెల్లం ఖరీదు రు. 10-8-0 కనీసధరగా నిర్ణయించాలి.

(5) మార్కెట్టులో రు. 10-8-0 కంటె తగ్గినచో, ప్రభుత్వమే ఆ ధరకుకొని ఎగుమతి చెయ్యాలి.

(6) వ్యవసాయపాటుకు అతిముఖ్యమైన బండిపట్టాలు, ఇనుపరేకులు వ్యవసాయశాఖ ద్వారా సప్లయి చేయాలి.

(6 వ పేజీ తరువాయి) మివ్వాలని కోరుతూ శర్మగారికి రు. 50 లు సమర్పించారు.

బాగంటి గోపాలకృష్ణ అనే విద్యార్థి అప్పారాయ కవిని గురించి తానువ్రాసిన పద్యాలు చదివారు.

శ్రీ హనుమచ్ఛాస్త్రిగారు ప్రసంగిస్తూ అప్పారావుగారు ఎటుచూచినా చిత్రమైన పండితుడనీ, గొప్ప సంస్కర్తయనీ, నిశిత విమర్శకుడనీ, రసదిగ్ధమైన హృదయం గలవాడనీ ప్రశంసా వాక్యాలు పలికారు. వ్యావహారిక భాషకు అఖండ సేవచేసి, కవిత్వాన్ని తేటతెలుగు మాటలతో ప్రజలకర్థమయ్యేలాగున వ్రాసి ప్రజల కందించిన ఆదర్శకవి అప్పారావని ఉగ్గడించారు. నాటి రోజుల్లో సమాజంలో ప్రబలిఉన్న దురాచారాలను నిర్భీతిగా ఖండించిన విప్లవ సంస్కర్తయనీ, ప్రజలలో తన వ్యావహారిక కవిత్వం ద్వారా దేశభక్తిని ప్రబోధించిన ప్రతిభావంతుడనీ పొగడి తమ ఉపన్యాసాన్ని ముగించారు.

★

గ్రామ కరణం అక్రమ చర్యలు

తల్లుఖానడుపాలెంలో కొందరు బీదలు సర్కారు డొంకలను సాగుచేసికొన్నారు. మొదటినుంచీ వారలను సాగుచేసుకొమ్మని కరణముగారు చెపుతూనే వచ్చారు. ఇప్పుడు వరిపంట కోతకువచ్చిన తరుణములో కరణంగారు వారలను పిలిచి "మీరు పండించిన పంటలో నాకు సగము యివ్వవలయును. లేనిచో మీమీద రిపోర్టుచేస్తాను. యకరం 1కి రు. 20 లు చొప్పున పెనాల్టీవేస్తాను." అని బెదిరిస్తున్నాడు. పాపం, సంవత్సరమంతా కష్టించి తీరా అనుభవించబోయేసరికి యిలా అన్యాయం జరగడం యెంత దారుణం!

ఈ గ్రామ కరణముగారి అక్రమచర్యలను అరికట్టవలెనని పై అధికారులను కోరుచున్నాము.

— యం. లక్ష్మీనారాయణ

నర్సారావుపేట పరిసరగ్రామాల్లో రేషనింగు ప్రవేశపెట్టాలి

నరసారావుపేటలో షుమారు 1000 మంది కార్మికులు పనిచేస్తూ పరిసరగ్రామాల్లో నివసిస్తూ ఉంటారు. వీరంతా పట్టణ జీవితానికి వెన్నెముకలాంటివారు. తమగ్రామాలుతరుగు ప్రాంతాలవడంవల్ల, నరసరావుపేటలో రేషనింగు ప్రవేశపెట్టడంవల్ల, యీ కార్మికులు ఆహారపదార్థాల కొరకై నానా అగచాట్లు పడుతూవచ్చారు.

కార్మికులు సాగించిన ఆందోళనఫలితంగా యెలాగైతేనేం అధికార్లు ఆయాగ్రామాల్లో డీలర్లను నియమించారు. అయితే వారానికి రెండుమూడురోజులకు సరిపోయే బియ్యం మాత్రమే అమ్మించ బూనుకున్నారు. అంటే నెల 1కి రూపాయకుమించి బియ్యం సప్లయి లేదన్నమాట. కరువులో అధికమాసమన్నట్లు యీ డీలర్లు విపరీత లాభాపేక్షతో రు 1కి 3¼ శేర్లు జొన్నలు, 2¼ శేర్లు బియ్యం అమ్మిన ఉదాహరణ లెన్నో ఉన్నాయి. అధికార నియమితులైన డీలర్లు గ్రామాల్లో అసలు ధాన్యమే అమ్మని ఉదాహరణలెన్నో ఉన్నాయి. దీనికి వెనుక అధికార్ల ప్రోత్సాహం లేకపోతే యిలా జరుగదు. ఈవిధంగా డీలర్లకు సప్లయికాబడ్డ ధాన్యంలో విశేషభాగం దొంగ మార్కెటుకు పలాయనమయ్యేది.

డీలర్లుచేసే ఈ దగాలన్నిటిని యెప్పటికప్పుడు 6 మాసాలనుంచి సభల ద్వారా, డెప్యుటేషన్ల ద్వారా, యితరవిధాలా అధికారులకు తెలియబరచినప్పటికీ విచారణ లేదు.

పరిసర గ్రామాల్లో ఆహారపరిస్థితి యీ విధంగా క్లిష్టరూపం దాల్చినప్పుడు కార్మికులు ఆహారపదార్థాలు దొరక్క, పట్టణంలోనుంచి రహస్యంగా బియ్యం తీసుకెళ్ళడం మొదలెట్టారు. పట్టణంలో రేషనింగు విధానం దెబ్బతినే పరిస్థితులు ఏర్పడ్డాయి. లాగుడుబండ్ల కార్మికులమీదనే పట్టణప్రజల జీవితమాధారపడియున్నది. ఫ్యాక్టరీ కార్మికులకు ఆహారం లేనిచో, అధికాహారోత్పత్తికవసరమైన వేరుసెనగపిండి, ఆముదం పిండి తయారవడం దుర్లభం. కాబట్టి నరసారావుపేటలో రేషనింగు, ఎరువుల ఉత్పత్తి, ధాన్యసరఫరా సక్రమంగా జరగాలంటే, ప్రభుత్వం వెంటనే యీ క్రింది కోర్కెలను నెరవేర్చాలి.

(1) పట్టణంలో పనిచేస్తూ, పరిసర గ్రామాల్లో నివసించే కార్మికులకు నక్రమంగా కార్డువద్ధతిమీద రేషన్లు యిప్పించాలి.

(2) రేషన్లలో జొన్నలు, బియ్యం కూడా యివ్వాలి. ఒక్కొక్క కార్మికునకు 3 యూనిట్ల చొప్పున యివ్వాలి.

(3) కార్మికులందరు నియమించుకున్న డీలర్ల ద్వారానే అమ్మించాలి.

(4) అధికలాభాలకు అమ్మే తిండిదొంగల మీద వెంటనే చర్యతీసుకోవాలి.

పోపూరి బ్రహ్మానందం,
సెక్రటరీ, నర్సారావుపేట లాగుడుబండ్ల ముఠా కార్మికసంఘం.

రైసుమిల్లుకార్మికులు సాధించుకొనిన సదుపాయాలు

ఏలూరులో 1944 ఆగస్టు మాసములో రేషనింగు ప్రవేశపెట్టారు. కొద్దిరోజులకే మొత్తం 17 రైసుమిల్లులలోను 12 మిల్లులను షాహుకార్లు కట్టివేశారు. షుమారు 500 మంది కార్మికులు కూటికై అల్లాడాలని వచ్చింది. పనివారలందు అసంతృప్తి చెలరేగింది. యూనియన్ ఆఫీసుకు కార్మికులు యెగబ్రాకారు.

మిగిలిన 5 మిల్లులు ఏలూరు తాలూకాకు, పట్టణానికి బియ్యం సప్లయిచేసే రేషనింగు మిల్లులు. ఈకార్మికులుకూడ తమసోదరకార్మికుల విషాద పరిస్థితులను గమనించి గాఢమైన సానుభూతి వహించారు. మద్రాసు రాష్ట్రమంతటా కూడ రైసుమిల్లులలో యీ దారుణ పరిస్థితులే యేర్పడినయి. ప్రభుత్వం రైసుమిల్లులకు ఎస్సెన్షియల్ సర్వీస్ ఆర్డినెన్సు వర్తించుతుందని అక్టోబరు మాసంలో ప్రకటించింది.

ఈ ఆర్డినెన్సు ద్వారా రేషనింగుకు సప్లయిచేయు రైసుమిల్లు నిరంతరం పనిచేస్తూ రేషనింగు సఫలమయేలా చేయ్యాలని ప్రభుత్వం సంకల్పించుకొన్నది. కాని, యజమానులు రైసుమిల్లులు మూసివేస్తుంటే ప్రభుత్వం మిన్నకున్నది.

కాని యేలూరు ఫ్యాక్టరీవర్కర్సు యూనియన్ యెలా చేతులు ముడుచుకొని కూర్చొనగలదు! ఇటు రేషనింగు మిల్లులలో కార్మికులు సమ్మెకుదిగకుండా చూడాలి. అటు నిరుద్యోగ కార్మికులకు పరిహారం యిప్పించాలి. ప్రజానీకానికి బియ్యం సప్లయిచేసి తమ కర్తవ్యాన్ని నెరవేర్చ వలసిందని రేషనింగు మిల్లుకార్మికులకు ఉద్బోధించింది. నిరుద్యోగ కార్మికులకై జిల్లా కలెక్టరుకు, లేబరుకమీషనరుకు ఈ ఆర్డినెన్సు అమలుజరుపవలసిన ఉద్యోగస్తులకు మహజర్లు గుప్పించింది. ప్రజల్లో తీవ్రమైన ప్రచారం చేశారు కార్మికులు. యజమానులచేత కూడ పనివారల న్యాయమైన కోర్కెలను గుర్తింపచేశారు.

ఆగస్టునుంచి నెలజీతాలవారికి పనిలేని నెలలకు కూడ పూర్తి జీతాలు యిప్పించారు. 4 మిల్లులలో నెలకు రు. 8 లు చొప్పున అడకూలీలకు అడ్వాన్సు యిప్పించారు. పట్టుబడిదారులకుకూడ ఒకమిల్లులో అడ్వాన్సు యిప్పించగల్గారు.

రోజు కూలీలుగా ఉండే స్త్రీలకు 0-8-0, పురుషులకు 0-12-0 పూర్వం యిచ్చేవారు. ధరల పెరుగుదల ననుసరించి, స్త్రీలకు 0-12-0, పురుషులకు 1-0-0 యివ్వవలెనని యూనియన్ కోరింది.

మూడు ఆయిల్ మిల్లులలో స్త్రీలకు 0-12-0, పురుషులకు 0-14-0 యిచ్చుటకు అంగీకరించారు. మిగిలిన మిల్లులలో కూడ యీ రేట్లు యివ్వవలెనని ఆందోళన చేస్తున్నారు. త్వరలోనే యజమానులు యీ కార్మికులకు అనుకూలంగా పరిష్కారం చేయవచ్చునని తెలుస్తున్నది. పట్టుబడిదారుల విషయంలో కూడా రేట్లు అధికం చేయవలసిందని కోరుతున్నారు.

గ్రీసు, పోలెండు సమస్యలపట్ల సోవియట్ వైఖరి ఏమిటి ?

ప్రశ్న :

గ్రీసు, బెల్జియందేశాల్లో బ్రిటిష్‌సామ్రాజ్యవాదుల ధోరణి చూడండి. దౌర్జన్యంగానైనాసరే ప్రజాఉద్యమాలను అణచివేసి తమ అధికారాన్ని నిలబెట్టుకొనుటకు ప్రయత్నిస్తున్నారు. 'అట్లాంటిక్ ఛార్టర్' అనేదిలేదని గూడా రూజ్‌వెల్టు చెప్పేశాడు. సామ్రాజ్యవాదుల వైఖరి ఇలా ఉంటే స్టాలిన్ ఏమీ మాట్లాడడు. ఇదంతాచూస్తే సామ్రాజ్యవాదుల ప్లానులను స్టాలిన్, పోలెండులో స్టాలిన్ ఆశయాలను సామ్రాజ్యవాదులూ పరస్పరంగా సమర్థించుకుంటూ, 'ఎవరి రంగంలో' వారు తమ ఆధిపత్యాలకొరకు ప్రయత్నిస్తున్నట్లు కనపడుటలేదా ?

సమాధానం :

సామ్రాజ్యవాదుల ప్లానులు

నాజీసైన్యాంతో 4 సంవత్సరాలు పోరాటం చేసిన యూరప్‌ఖండ ప్రజలు ఒకరి తరువాత ఒకరు విముక్తిపొందుతూ తమ భవిష్యత్తును తామే నిర్ణయించుకొనుటకు ముందుకు సాగిపోతూంటే, ఇంకా సామ్రాజ్యాలను గురించి కలలుగంటున్న బ్రిటిష్, అమెరికన్ సామ్రాజ్యవాదులకు ప్రాణసంకటంగా ఉంది పాపం!

ఫ్రాన్సు, ఇటలీ, హాలెండు, యుగోస్లావియా దేశాల విషయంలో స్వదేశాలను, ప్రజలను వదిలి పారిపోయిన ప్రభువులను నాజీ హంతకులతో సహకారంచేసిన ద్రోహులను ప్రజా ఉద్యమాలకు వ్యతిరేకంగా సామ్రాజ్యవాదులు ఎలా బలపరచిందీ, వారి ప్లానులన్నీ ఎలా భగ్నమైయినదీ అందరికీ తెలును.

ఐక్యప్రజాఉద్యమాలముందు వారిప్లానులు సాగవని ఇన్నిసార్లు నిరూపించబడినా, మళ్ళీ నేడు గ్రీసు, బెల్జియమ్‌దేశాల్లో సామ్రాజ్యవాదులు సైన్యాలతోసహా తయారైనారు. దౌర్జన్యంగా దేశభక్తుల ఉద్యమాన్ని అణచివేయబోతే, బ్రిటిష్ ప్రజలే బ్రిటిష్ ప్రభుత్వానికి వ్యతిరేకమయారు. ఇక వ్యవహారం కట్టిపెట్టమని బ్రిటిష్ ధనికవర్గ పత్రికలుగూడా చర్చిల్ ప్రభుత్వాన్ని హెచ్చరించినయి. ఐక్యగ్రీకు ప్రజాఉద్యమంవెనుక ప్రపంచప్రజలంతా నిలబడ్డారు.

సామ్రాజ్యవాదుల ప్లానులలో కొత్త ఏముంది? ఆశ్చర్యపడవలసిన అవసరం ఏముంది? గ్రీసులో బ్రిటిష్‌వైఖరిని ఖండించే విమర్శకులకు సమాధానంగా "అట్లాంటిక్ ఛార్టర్" లేదని రూజ్‌వెల్టు చెప్పాడంటే మాత్రం ఆశ్చర్యం దేనికి? దగాచేయటం సామ్రాజ్యవాదుల లక్షణమని ఎవరికి తెలియదు? అయితే 1942 లో ప్రకటించబడిన అట్లాంటిక్ ఛార్టర్ సూత్రాలను ఆధారంచేసుకుని ప్రపంచం మొత్తంమీద ఫాసిస్టు వ్యతిరేకంగా ఐక్య ప్రజాఉద్యమాలు బలపడినాయి. ఈ ఉద్యమాలను నిర్మించుకున్న దేశాల్లో ప్రజలు అట్లాంటిక్ ఛార్టర్‌ను వర్తింపచేసుకుంటున్నారు.

పోలెండు-సోవియట్ ప్రభుత్వం

అయితే పైనచెప్పబడిన సామ్రాజ్యవాదుల వైఖరికి, స్వాతంత్ర్య ప్రజా పోలెండు నిర్మాణం కొరకు సోవియట్ ప్రభుత్వం చేసిన సూచనలకు పోలిక ఏముంది? అలా పోల్చేవారు కొన్ని ప్రధాన విషయాలను గుర్తించడం లేదు.

(1) పోలిష్‌ప్రజలకు న్యాయంగాచెందిన పోలిష్ ప్రాంతమంతా కలిపి ప్రజాస్వామిక పోలెండుగా నిర్మాణం జరిగినప్పుడే బలమైన నూతన ప్రజా పోలెండు ఏర్పడగలదని సోవియట్‌వాదం. అంటే 1920 లో సామ్రాజ్యవాదుల అండతో అప్పటి పోలిష్‌ప్రభుత్వం అక్రమంగా ఆక్రమించిన తెల్లరష్యా, యుక్రెయిన్ ప్రాంతాలను తిరిగి సోవియట్‌కు ఇచ్చివేయాలని, పోలెండుకు న్యాయంగా చెందిన పోమెరేనియా, సిలీసియా ప్రాంతాలను జర్మనీనుంచివిడదీసి పోలెండుకు కలపాలని, స్టాలిన్ సూచించాడు. సరిహద్దులలో ఉంటూ స్నేహంగా ఉండవలసిన దేశాలమధ్య ఘర్షణలకు దారితీసే కారణాలను రద్దుచేయుటద్వారానే శాంతి ఏర్పడగలదుగాని, కొందరు వాదించినట్లు మూడవయుద్ధానికి ప్రేరేపణకాదు.

తమ పూర్వపు ప్రభుత్వంచేసిన తప్పులను అనుభవంద్వారా గ్రహించిన పోలిష్ ప్రజలు సోవియట్‌సూచనలను హర్షించారు. పోలిష్ స్వాతంత్ర్య ఉద్యమాన్ని, నూతన ప్రజా పోలెండును బలపరిచే సోవియట్ పాలిసీకి, గ్రీక్ ప్రజాఉద్యమాన్ని నాశనం చేయుటకు తయారైన ఫలితంగా ప్రపంచమంతటిచే ఏకకంఠంతో ఖండించబడుతున్న బ్రిటిష్‌వైఖరికి పోలిక ఏముంది?

(2) పోలెండు విషయంలో సోవియట్ ప్రభుత్వంచేసిన సూచనలను బ్రిటిష్ అమెరికన్ ప్రభుత్వాలు బలపరుస్తున్నవంటే, వెంటనే ఇద్దరిమధ్య అంగీకారం ఉందని చెప్పుటకు సాహసించేవారు, గత 4 సంవత్సరాల చరిత్రను మరిచిపోతున్నారు. స్టాలిన్ సూచనలకు వ్యతిరేకంగా, పోలిష్ ప్రజలకు వ్యతిరేకంగా 4 సంవత్సరాలపాటు బ్రిటిష్ ప్రభుత్వం, పోలెండును వదిలి లండన్‌లో కూర్చున్న 'సికోర్‌స్కీ' మొదలైన ద్రోహులను బలపరచలేదా? జర్మనీతో సహకారంచేసిన పోలిష్ సైన్యాధిపతులకు మద్దతు ఇవ్వలేదా? యుద్ధరంగంలో నిలబడి నాజీ సైన్యాలను ఎదుర్కొంటున్న కొంచి పోలిష్ ప్రజాఉద్యమానికి నూతనబలం, ఐక్యత వచ్చినయి. ఈ ఉద్యమంముందు సామ్రాజ్యవాదులు చిట్టచివరికి లొంగక తప్పలేదు. బుద్ధిపూర్వకంగా సోవియట్ సూచనలను చర్చిల్ బలపరచటం జరిగిందని వాదించటం చరిత్రకు వ్యతిరేకమవుంది.

పోలెండులో అపజయం పొందిన సామ్రాజ్యవాదులకు గ్రీసులోకూడా తిరిగి అపజయం తప్పటంలేదు. గ్రీసు ప్రజలకు ప్రపంచ ప్రజలందరి సానుభూతి అతిక్రమకాలంలో వచ్చింది.

(3) గత 26 సంవత్సరాల సామ్రాజ్యవాద వ్యతిరేకచరిత్రతో, ఈ యుద్ధకాలంలో ఫాసిస్టు వ్యతిరేకంగా యూరపియన్ దేశాల ప్రజాఉద్యమాలను, స్వతంత్రపోరాట కమిటీలను అందరికంటె ముందు గుర్తిస్తూ, స్వాతంత్ర్య ఉద్యమానికి నాయకత్వం వహిస్తున్న సోవియట్ ప్రభుత్వమును గురించి అపోహలా? సామ్రాజ్యవాద ఆశయాలను నిరూపించే సామ్రాజ్యవాదుల ప్రవర్తనకు, స్వాతంత్ర్యఆశయాలను బలపరిచే సోవియట్ ఆశయాలకు గల భేదాన్ని గుర్తించుట అవసరం.

అసలు విషయం

మిత్రమండలికి చెందిన బ్రిటిష్ అమెరికన్ సామ్రాజ్యవాదులకు, సోవియట్ ప్రభుత్వానికి దృక్పథాల్లో భేదాలు ఉన్నాయి. అయినప్పటికి లోకానికి ప్రమాదంగా తయారైన ఫాసిస్టులను నాశనం గావించుటకు బద్ధులై, మిత్రమండలిలో ఉన్నారు.

ఫాసిస్టు వినాశనం ద్వారానే స్వాతంత్ర్యం సంపాదించుకొనగలమని గ్రహించి, ప్రపంచ ప్రజలు, వారినందరిని ఉత్తేజపరుస్తూ పోరాటంచేస్తున్న సోవియట్ ప్రజల వెనుకనడుస్తూ మరింత బలపడుతున్నారు. బలపడుతున్న ప్రజాఉద్యమాలనుసహించలేని సామ్రాజ్యవాదులు అప్పుడప్పుడు తలయెత్తుతుంటే, వారి ప్లానులను భగ్నంకావిస్తూ ప్రజలు వారిని గూడ ముందుకి లాక్కుపోతున్నారు. సామ్రాజ్యవాదుల ప్లానులు ఒకటి తరువాత ఒకటి అన్ని దేశాల్లో భగ్నమవుతున్నాయి. ప్రజావత్తిడిముందు పరాజయాలు పొందుతూ, ఫాసిస్టు వినాశనం తరువాత ప్రపంచ శాంతి, ఆశయంగాగల టెహరాన్ ఒడంబడిక ప్రకారం బద్ధులైనారు.

టెహరాన్ ఐక్యత

టెహరాన్ ఒడంబడికను ఆధారంచేసుకొని సత్వర ఫాసిస్టు వినాశనమునకు, యుద్ధానంతరం తిరిగి యుద్ధాలు రాకుండా చేయుటకు ప్రపంచ ప్రజలందరూ కృషిచేస్తున్నారు. యుద్ధానంతరం తిరిగి సంక్షోభాలు రాకుండా చేయగల జాతీయ ప్లానులను అమలుజరుపుటకై బ్రిటన్, ఫ్రాన్సు అమెరికా మొదలైన దేశాల్లో ప్రజలు తీర్మానిస్తున్నారు.

ఈ పరిస్థితుల్లో తమ ఉనికికి గూడా ప్రమాదం వస్తోందని గ్రహిస్తున్న సోవియట్ వ్యతిరేకులు బ్రిటన్ అమెరికాలలో, యూరపియన్‌దేశాల్లో సోవియట్ వ్యతిరేక ప్రచారాన్ని లేవదీస్తున్నారు.

అంతేగాదు. బ్రిటిష్ ప్రాబల్యం క్షీణిస్తోందని ఏడ్చే కొందరు అప్పుడే "ఈ టెహరాన్ ఒడంబడిక మనలను ఎక్కడికి తీసుకుపోతున్నదీ గ్రహించాలి!" "అమెరికాతో గాని, రష్యాతోగాని త్రెంచుకొనుట అవసరమని" ప్రచారం చేస్తున్నారు. అమెరికాలో గూడా బ్రిటిష్ వ్యతిరేకతను రెచ్చగొట్టేవారు, "యూరప్‌లో మన ఆధిక్యత లేకుండా బ్రిటన్ తన ఇష్టం వచ్చినట్లు చేస్తోందని". బ్రిటన్‌తోనూ, రష్యాతోనూ సంబంధాలు త్రెంచుకోవాలని ప్రచారం సాగుతోంది. బ్రిటిష్ అమెరికన్ సామ్రాజ్యవాదుల మధ్య గల వైరుధ్యాలు, సామ్రాజ్యవాదులకు సోవియట్‌కు మధ్యగల వైరుధ్యం పెరుగుతున్నాయి. కాని ఫాసిస్టులకు సహాయపడే ఈ విద్రోహ ప్రచారాన్ని జయప్రదం కానివ్వకుండా టెహరాన్ ఐక్యతను కాపాడుతూ ప్రపంచ ప్రజలు తమ ఉద్యమాన్ని బలపరచుకుంటున్నారు.

ప్రపంచమంతా బోల్షివిజం వ్యాపిస్తోందని, రష్యాతో త్రెంచుకోవాలని, బెల్జియం, గ్రీసులలో వృద్ధి అయిన ఐక్య ప్రజా ఉద్యమాలను కమ్యూనిస్టు విప్లవాలని, రష్యా బల్గేరియా ద్వారా గ్రీకులకు ఆయుధాలు సప్లయి చేస్తోందని సోవియట్‌కు వ్యతిరేకంగా ప్రచారం బయలుదేరుతోంది!

ఐక్యతా నిర్మాతల బాధ్యత

ప్రజా ఉద్యమాలను, వాటికి ఆధారంగా ఉన్న టెహరాన్ ఒడంబడికను విచ్ఛిన్నం చేయడానికి సోవియట్ వ్యతిరేకుల ప్రచారం సాగిస్తున్న పరిస్థితులలో, స్టాలిన్ సామ్రాజ్యవాదుల ప్లానులకు తల ఊపుతున్నాడని అనుటలో అర్థంలేదు. ప్రజా స్వాతంత్ర్య ఉద్యమాలను యూరపియన్ దేశాలన్నిటిలో బహిరంగముగా బలపరచిన సోవియట్ ప్రభుత్వాన్ని, సామ్రాజ్యవాదులతో పోల్చుటలో అర్థంలేదు. బెల్జియంలో సామ్రాజ్యవాదుల వైఖరికి సోవియట్ ప్రభుత్వం అసమ్మతి తెలిపింది. గ్రీసు విషయంలోగూడా అసమ్మతి తెలియజేసి యుంటుందనుటలో సందేహంలేదు. నేడు గ్రీసు రాయబారాల్లో సోవియట్ ప్రతినిధి పాల్గొంటున్నారు.

టెహరాన్ ఐక్యతను కాపాడే బాధ్యత ఈనాడు ప్రపంచ ప్రజలమీద, సోవియట్ ప్రభుత్వం మీద పడింది. టెహరాన్ ఐక్యతను విచ్ఛిన్నం చేయుటకై, సోవియట్‌ను రెచ్చగొట్టుటకై సోవియట్ వ్యతిరేకప్రచారం సాగించవచ్చు. కాని రెచ్చిపోయేది స్టాలిన్ కాదు. తనప్రజల బలంమీద, ప్రపంచప్రజల ఉద్యమాల బలంమీద ఆధారపడే సోవియట్ ప్రభుత్వం ఫాసిస్టులకు దోహదమిచ్చేవిచ్ఛిన్నకుల కుతంత్రాలకు రెచ్చిపోలేదు. మిత్రమండలి ప్రజలఐక్యతను విచ్ఛిన్నపరచ కోరేవారి వలలో స్టాలిన్ పడడని సోవియట్ చరిత్ర నిరూపిస్తోంది.

ఈ యుద్ధకాలంలో, నిర్మించబడుతున్న ఐక్య ప్రజాఉద్యమాలను, సామ్రాజ్యవాదులు పొందుతున్న అపజయాలను గుర్తించుటకు నిరాకరించేవారు బ్రిటన్, రష్యాలమధ్య మళ్లీ యుద్ధం వస్తుందని కలలుగంటూ, స్టాలిన్ మాట్లాడడేమి? అని ప్రశ్నిస్తారు. ఐక్య ప్రజా ఉద్యమాలద్వారా ఫాసిస్టు వినాశనమేగాకుండా ఫ్రాన్సు, పోలెండు, ఇటలీ, యుగోస్లావియా ....ఒకదానితరువాత మరొకదేశంలో స్థాపించబడుతున్న ఐక్య ప్రజాప్రభుత్వాలు, ఆయా దేశాల్లో ప్రజాఉద్యమాలను వ్యతిరేకించేవారి గతి చూపినయెడల సామ్రాజ్యవాదులకు భవిష్యత్తు లేదని, సామ్రాజ్యవాదుల ప్లానులను ఓడించుటకు మార్గం మిత్రమండలిలో చీలికలు కోరుటగాదని, ఐక్య ప్రజాఉద్యమాలను పెంపొందించుటయే మార్గమని, అందులకై మిత్రమండలి ప్రజల ఐక్యతకు పునాదియైన టెహరాన్ ఐక్యతను బలపరచాలని విశదమవుతుంది. అంతేగాని టెహరాన్ ఐక్యతను కాపాడుతూ ప్రజాఉద్యమాలను బలపరుస్తూన్న సోవియట్ ఆశయాలను శంకించుటకాదు మార్గం.

— కంభంపాటి సత్యనారాయణ

(జూనియర్)

ప్రజాశక్తి చందావివరాలు

★

సంవత్సరం చందా	5—0—0
అర్థసంవత్సరం చందా	2—8—0
మూడునెలలచందా	1—4—0

"జీవితాన్నీ సాహిత్యాన్నీ వేరుచేసిన గోడలను పడగొట్టాలి"

నవ్యసాహిత్య పరిషత్తు సమావేశం

సెట్టి ఈశ్వరరావు

నవ్యసాహిత్య పరిషత్ పదవ మహాసభ డిసెంబరు 23, 24 తేదీలలో మహావైభవంగా జరిగింది. నవ్యాంధ్ర సాహిత్యాన్ని నిర్మించిన అనేకమంది కవిశేఖరులు, కథకచక్రవర్తులు, విమర్శకులు, తదితర సాహిత్య ప్రసిద్ధులూ తెనాలిలో జరిగిన యీ సాహిత్య ఉత్సవాల్లో పాల్గొన్నారు. రాయప్రోలు సుబ్బారావు, చింతా దీక్షితులు, కాటూరి వెంకటేశ్వరరావు, కోలవెన్ను రామకోటేశ్వరరావు, తెలికిచర్ల వెంకటరత్నం, తల్లావఝ్ఝుల శివశంకరశాస్త్రి, దేవులపల్లి కృష్ణశాస్త్రి, మల్లంపల్లి సోమశేఖర శర్మ, కురుగంటి సీతారామయ్య, అడవి బాపిరాజు, జమ్మలమడక మాధవరామశర్మ, శ్రీరంగం శ్రీనివాసరావుగార్ల వంటి సాహిత్య సుప్రసిద్ధులు మహాసభ నలంకరించేరు. మహాసభ వేదిక నుండి తమతమ అభిప్రాయాల్ని వెలిబుచ్చేరు. సాహిత్యపిపాసులలో ఆందోళననూ - అలజడినీకూడా కలిగించేరు.

పరిషత్తు కర్తవ్యం

తెనాలి విద్యావంతుల్లోనూ, పత్రికలద్వారా ఆంధ్ర విద్యావంతు లందరిలోనూ యీమహాసభకార్యకలాపాలు ఆందోళననూ, అలజడినీ రేకెత్తించేయని చెపితే సత్యదూరం కాదు.

ప్రజలు నవ్యసాహిత్యపరిషత్తువల్ల ఆసక్తినీ అభిమానాన్నీ చూపెట్టేరు. తానుకూడా ప్రజలపట్ల ఆసక్తినీ, అభిమానాన్నీ చూపి పరిషత్తు తన కృతజ్ఞతను తెలుపుతుందనడానికి సూచనలు లేకపోలేదు.

"మన ప్రాచీన, నవీన సాహిత్యాలలోని రసవద్ఘట్టాలు మనప్రజలకు అందుబాటులో వుండేటట్టు మనం యత్నించాలి. రసికత, సౌందర్యపిపాస, కళాదృష్టి ప్రజలలో లోపించినచో జాతి నశిస్తుంది. కూడూ, గుడ్డా శరీరానికి, ఆత్మకూ అవసరం. ఈ ప్రధాన సూత్రాలను మనం విస్మరించకూడదు. అతీంద్రియమై, బుద్ధిగ్రాహ్యమైన పరమసత్యాన్ని అన్వేషించడానికి కళాసృష్టి యెంతో తోడ్పడుతుంది."

అని మహాసభ ప్రారంభం చేసిన రామకోటేశ్వరరావుగారు ఉపన్యసించేరు.

రామకోటేశ్వరరావుగారి అపోహలు

కాని వేదఘోషలూ, మంగళ వాద్యాలూ అయిన తరువాత ప్రారంభమైన రామకోటేశ్వరరావుగారి ఉపన్యాసంలో అపస్వరాలు వినబడుతున్నాయి.

ఈయన తన ఉపన్యాసంలో తెలిసో తెలియకో అభ్యుదయసాహిత్యం మీద చాలా తీవ్రమైన ఆరోపణలు చేసేరు. ఈ ఉద్యమ స్వభావాన్ని తెలుసుకోకుండా చేసిన ఆరోపణలివని స్పష్టంగా తెలుస్తూంది. రామకోటేశ్వరరావుగారివంటి సాహిత్యప్రియుడు, విమర్శకుడు కూడా విషయం తెలుసుకోకుండా విమర్శించి, ఒక సాహిత్యాభ్యుదయ ఉద్యమంపట్ల అపోహలు కలిగించినప్పుడు, వాస్తవిక జగత్తుకంటె ఆధ్యాత్మిక జగత్తునే ప్రేమించి, యదార్థాన్వేషణపట్ల శ్రద్ధచూపని వెంకటేశ్వరరావుగారు తాను తప్పుతోవలోపోయి, యితరులు తప్పుతోవలో పోవడానికి అవకాశాలు కలిగించేరంటే ఆశ్చర్యమేమీలేదు.

రామకోటేశ్వరరావుగారు అభ్యుదయరచయితల నోటకుక్కిన వాక్యాలు:

"రాజకీయ, సాంఘిక, విప్లవ జ్వాలలు రగుల్కొల్పి, వర్గద్వేషాన్ని పెంపొందించి, మరోప్రపంచానికి దారితీసే కవిత్వమే కవిత్వమంటారు. పద్యంకానీ, పాటగానీ, కథకానీ, నాటికకానీ యీ విప్లవానికే తోడ్పడాలి. భగవంతుడు, భక్తి, ధర్మము, నీతి, వివాహం, కుటుంబం, యివన్నీ సంఘంలో పైఅంతస్తులవారు క్రింది అంతస్తులవారిని అణచివేయడానికి యేర్పడ్డ మోసాలు. వీటియందు వెర్రినమ్మకం కుదర్చడానికే వాల్మీకినుండి నేటివరకు కవులు పండితులు తప్పుడువ్రాతలు వ్రాసి, ప్రజానీకానికి 'దోపు' నల్లమందు మత్తెక్కించారు. సూక్ష్మంగా, అభ్యుదయ రచయితల వాదనయిది. కన్నడదేశంలో ప్రగతిశీల సాహిత్య రచయితలు యిట్టివారే. భారతదేశమంతా యీ భావాలు వ్యాపించాలని వీరి కోరిక."

అభ్యుదయ పదానికి అభ్యుదయ రచయితలు చేసే నిర్వచన మిదియని కోలవెన్ను వారు యే ఆధారంమీద అన్నారో తెలియదు. కాని యింతకన్న సత్యదూరమైన వాక్యాలు అభ్యుదయ రచయితల గురించి యింకెవరూ చెప్పివుండరు.

నవ్యతను విచక్షణాజ్ఞానం లేకుండా స్వీకరించేవారిలాగానే, హృదయరహితంగా ఖండించేవారూ వున్నారు. దేనినైనా విమర్శించడానికి పూనుకున్నవారు మంచి చెడ్డలను పాక్షిక బుద్ధిని విడిచిపెట్టి తెలుసుకోవాలి. తమకు తెలియకపోతే ఇతరులనుండి తెలుసుకోవాలి.

ఇటువంటి పాక్షికపద్ధతితో దుష్ప్రచారం చేయబడినవారు అభ్యుదయ రచయితలు. ఇప్పుడు నవ్యసాహిత్య పరిషత్తులో వున్న చాలమంది నవకవులు కూడా ఒకప్పుడు యిటువంటి దుష్ప్రచారానికి గురిఅయినవారే. కాని నిజం నిలకడమీదతేలింది. నవకవులు గౌరవార్హులయ్యేరు. నవ్యసాహిత్యము సుస్థాపిత మయింది.

ఆంధ్రపత్రిక వ్యాఖ్యానాలు !

"భావకవిత్వంలోని కవితా వస్తువు రుచించక, "అభ్యుదయరచయితలు అధివాస్తవిక రచయితలు" అంటూ కొందరిప్పుడు పూర్వ సాహిత్యంమీద విప్లవం లేవనెత్తారు." అభ్యుదయ రచయితల్ని దుష్ప్రచారం చేస్తున్న మచ్చుముక్క — ఆంధ్రపత్రిక 26, 1944 సంపాదకీయంలోనిది.

ఈ భాగంలో వున్న అపూర్వమైన అజ్ఞానానికి అభ్యుదయ రచయితలు విచారిస్తున్నారు.

ఉత్తమమైన పూర్వసాహిత్యమంతా అభ్యుదయరచనయే అని అభ్యుదయ రచయితలు అనేకసార్లుచాటిచెప్పేరు. వారిపత్రికల్లోను, సంఘ ప్రచురణల్లోనూ యిది అనేకసార్లు నొక్కిచెప్పబడింది. అయినా అధివాస్తవికత రచయితలతో అభ్యుదయ రచయితలను జోడించి, వారుపూర్వసాహిత్యాన్ని రూపుమాపడానికి పూనుకున్నారని వ్యాఖ్యానించడం, అభ్యుదయరచయితలను గురించి అనేకసార్లు తూలనాడడం ఆంధ్రపత్రికకు భావ్యంకాదు. పాఠకులకు సత్యాన్ని తెలియజెయ్యటమే పత్రికలకు ఆదర్శం. ఆంధ్రపత్రికను స్థాపించి, పెంచి, పోషించిన నాగేశ్వరరావుగారి యీ ఆదర్శాన్ని యిప్పటి ఆంధ్రపత్రిక మన్నించాలి. అలవాటు కొత్తపూర్వమే. యీ సత్యభిన్నమైన ప్రచారాన్ని మానుకొని, ఆంధ్రుల విజ్ఞానాభివృద్ధికి దోహదం చెయ్యవలసిందని కోరుతున్నాను.

అభ్యుదయరచయితల్ని అర్థం చేసుకోండి

రాజకీయ, ఆర్థిక, సాంఘిక, నైతిక, మత విషయాములలో అభ్యుదయాన్ని కాంక్షించే రచయితలందరికీ అభ్యుదయ రచయితల సంఘంలో స్థానంవుంది. మన ప్రాచీన సంస్కృతిని పునాదులతో పెరికివేయవలసిందని అభ్యుదయ రచయితలు ఎన్నడూ అనలేదు. అంతే కాకుండా మన పురాతన సంస్కృతిపట్ల ప్రేమను చూపడంలో అభ్యుదయ రచయితలు యెవరికీ తీసిపోరు. ప్రపంచ సంస్కృతిలో ఉత్తమ స్థానంగల భారతీయ సంస్కృతికి వారసులమని అభ్యుదయ రచయితలు గర్విస్తున్నారు. వాల్మీకినుండి నేటివరకూ రాస్తున్న రచయితలు నల్లమందు మత్తెక్కించినట్లుగా అభ్యుదయ రచయితలు నమ్ముతున్నారనిరామకోటేశ్వరరావుగారు భ్రమపడుతున్నారు.

అభ్యుదయ రచయితల సంఘంలో అనేక రాజకీయ, సాంఘికాభిప్రాయాలు గలవాళ్లున్నారు. కాని రామకోటేశ్వరరావుగారు భ్రమిస్తున్నట్లు పరద్వేషులూ, బీభత్సవాదులూలేరు.

అభ్యుదయ రచయితలు వీరేశలింగం, కొమర్రాజు లక్ష్మణరావు, గురజాడ అప్పారావు, ధర్మవరం కృష్ణమాచార్యులు మొదలైన రచయితల వర్ధంతులు జరిపి, వారిని విస్మరిస్తున్న ఆంధ్రజాతిని మేలుకొల్పేరు. ఇది అందరూ యెరిగిన విషయం; అందరూ ప్రశంసించిన విషయం. కాని రామకోటేశ్వరరావుగారు మాత్రం అభ్యుదయ రచయితలు మనప్రాచీనసంస్కృతిని పడగొట్టడానికి పునాదులు తవ్వుతున్నారని అనవసరంగా గాభరా పడుతున్నారు.

తెలుగు సాహిత్యానికి అపారమైన సేవ చేసి, ఆర్థికలోపంవల్ల బాధపడుతున్న చిలకమర్తి లక్ష్మీనరసింహంపంతులుగారికి వెయ్యి రూపాయల కానుక సమర్పించడానికి అభ్యుదయ రచయితలు సంకల్పించుకున్నారు. అచ్చుకాక మూలనున్న ఆయన స్వీయచరిత్రను బహు వ్యయప్రయాసలకోర్చి, అచ్చొత్తించి, ఆయనకు ఆర్థికంగా సహాయపడిన అభ్యుదయ రచయితలు, "వాల్మీకినుండి నేటివరకూగల కవులూ, పండితులూ తప్పుడు వ్రాతలు వ్రాసి, ప్రజానీకానికి నల్లమందు మత్తెక్కించారు"అన్న నమ్మకం గలవారేనా? రామకోటేశ్వరరావుగారు అవునంటున్నారు!

అంతే కాకండా రామకోటేశ్వరరావుగారు పొరపడుతున్నట్టు అభ్యుదయ రచయితల సంఘం "మీరు యీ విధంగానే వ్రాయాలి" అని యెవరినీ శాసించలేదు. కాబట్టి వారు యెవరి "స్వాతంత్ర్యాన్నీ అరికట్ట లేదు." ప్రజాభ్యుదయానికి దోహదంచేసే రచనలు అవసరమని సలహానిచ్చిందే కాని, యెవరినీ దండించి వ్రాయించగల నిరంకుశత్వంగాని, అది అమలులోపెట్టడానికి తగినసాధనాలుగాని అభ్యుదయరచయితలకులేదు. వారు సాహిత్య పరిణామాన్ని పేర్కొని అభ్యుదయసాహిత్యం రాయవలసిందని మనవిచేసిరేగాని యెవరినీ నిర్బంధించలేదు.

అధ్యక్షుని అపోహలు

తరువాత తన అధ్యక్షోపన్యాసంలో కాటూరి వెంకటేశ్వరరావుగారు "ఘోరరాజ్యమైన రష్యా" నుండి "ఒక భయంకరాహ్వాన వికటాట్టహాసంతో లోకం మారుమ్రోగిపోతూ"న్నదని బెదిరిపోయేరు. గాంధీతత్వానికి దీనితో పోటీపెట్టడానికి ప్రయత్నించేరు. గాంధీజీ గురుతుల్యుడుగా యెంచిన లియోటాల్‌స్టాయికి రష్యనులు వారసులని వెంకటేశ్వరరావుగారు గుర్తించుకోవాలి. మానవశ్రేయోభిలాషి అయిన టాల్‌స్టాయి ఆదర్శాలను యింకే యితరజాతి కూడా ఆచరణలో పెట్టనప్పుడు రష్యన్లు మాత్రమే ఆచరణలో పెడుతున్నారు.

తేనెపట్టువంటి "సౌందరనంద" కావ్యాన్ని రచించిన మధురకవి కాటూరివారు. దానిలో వారు చూపిన పతిత ప్రపంచ చిత్రం శిలల్ని సైతం ద్రవింపజేస్తుంది. ఆకావ్యంలో వారు ప్రబోధించిన ఆదర్శమానవ సమాజాన్ని సాధించిన సోవియట్ వ్యవస్థనుచూసి కాటూరివారు, తన కలలు నిజమైనవని ఆనందించక పోవడమే కాకుండా, తమ ఆదర్శాన్నే మర్చిపోతున్నారేం? మానవజాతి శత్రువులైన ఫాసిస్టు, ఇంపీరియలిస్టు, కేపిటలిస్టు అబద్ధ ప్రచారాలన్నిటినీ చీల్చుకొని రొమేరోలా, రవీంద్రనాథ్‌టాగూర్, మహాత్మగాంధీ, జవహర్‌లాల్‌నెహ్రూ, సరోజినీనాయుడువంటి విశ్వవిఖ్యాతుల మన్ననలను పొంది, ఆదర్శమానవ సమాజంగా గుర్తింపబడిన సోవియట్ దేశంనుండి లోకాన్ని మారుమ్రోగించే భయంకరాహ్వాన వికటాట్టహాసం యేచెవులతోవిన్నారు? ఫాసిస్టుదేశాల్లో, వలస దేశాల్లోనూ, స్వదేశంలోనూ ప్రజలను తన యినుపకాలిక్రింద పెట్టివుంచిన సామ్రాజ్యవాద దేశాల్లోను కాటూరివారికి యీ ప్రళయాట్టహాసాలు వినిపించక పోవడం చేతనేనా, వాటివిషయమై ఆయన మౌనం దాల్చేరు!!

పెట్టుబడిదారి విధానంవల్ల యేర్పడే ఆర్థిక అక్రమాన్ని సరిదిద్దుకొని కూటికీ, గుడ్డకూ హామీనిచ్చే దేశం, వైద్యవిద్యాది అవకాశాలు ఉచితంగా యిచ్చే దేశం, స్వాతంత్ర్యాన్ని, సమానత్వాన్ని, సౌభ్రాతృత్వాన్ని, అక్షరాలా అమలుజరిపిన దేశం, నిరక్షరాస్యతను నిర్మూలించి ఉత్తమోత్తమమైన సంస్కృతిని నెలకొల్పిన దేశం, ప్రపంచప్రజలనూ, మేధావంతులనూ, డీన్ ఆఫ్ కాంటర్‌బరీవంటి మతపీఠాధికారులను సహితం ఆకర్షించిన రష్యాదేశం నుండి, కాటూరి వెంకటేశ్వరరావుగారికి ప్రత్యేకంగా "భయంకరాహ్వాన వికటాట్టహాసం వచ్చింది" చిత్రం!

మన దేశనాయకులందరూ, గాంధీజీతో సహా, రష్యాను అభినందించేరు. అది సాధించిన అపూర్వవిషయాలకు విస్మయంచెందేరు. ప్రపంచమంతటికీ మార్గదర్శకమైన దేశమని ప్రశంసించేరు. కాటూరివారు మాత్రం రష్యా

అభ్యుదయరచయితలు ప్రాచీన సంస్కృతికి వారసులు

నుంచి భయంకరాహ్వాన వికటాట్టహాసం మాత్రమే వింటారు!

పై నుదహరించిన పెద్దలిద్దరూ సహృదయతతో విమర్శించినట్టయితే, యిటువంటి పొరపాటులు చేసివుండరు. పోనీ కనీసం తాము మాట్లాడుతూన్న విషయం గురించి మంచీచెడ్డా తెలుసుకొని మాటాడినా యిటువంటి పొరపాటులు జరిగివుండకపోయేవి.

ఇప్పటికైనా వారిద్దరూ తమ పొరపాటులను, అపోహలను సవరించుకుంటారని సహృదయులంతా ఆశించవచ్చు. ఎప్పటికీ చేయకపోయిందానికన్నా ఆలస్యంగా చేసినా మేలే.

మల్లంపల్లివారి చారిత్రక వ్యాఖ్యానం

మల్లంపల్లి సోమశేఖరశర్మగారివంటి సుప్రసిద్ధ పరిశోధకులు సాహిత్యపరిణామాన్ని చారిత్రకంగా విశదీకరించేరు. సాహిత్యపురోగమనంలో నన్నయ వహించిన నాయకత్వం, సంస్కృతవ్యామోహంతోవున్న నాటి సాహిత్యాన్ని దానినుండి తప్పించి మాతృభాషాభ్యుదయాని కెలాతోడ్పడిందో వివరించేరు. ఆనాడు నన్నయను యెదుర్కొన్న సమస్యలను విపులీకరించేరు. సోమశేఖరశర్మగారి ఉపన్యాసం; పరిణామం సాహిత్యానికి సహజమని, చెప్పింది. సాహిత్యవిమర్శకు అదొక గీటురాయి.

తెలుగులో కావ్యరచనకు విరుద్ధంగావున్న బ్రాహ్మణులను లెక్కచేయకుండా రాజరాజనరేంద్రుడు భారతాన్ని రచించ ప్రోత్సహించాడని శర్మగారు వివరించారు. ఆకార్యభారాన్ని 'కులబ్రాహ్మణుడైన నన్నయభట్టు' వహించాడని, తెలియజేశారు. అలా చేయరాదని సంస్కృతభాషాభిమానులు విరోధించినా వారిని ఎదిరించి 'నన్నయ' భారతరచనకు పూనుకున్నాడు. భారతాన్ని తెలుగుప్రజలకు అందజేశాడని సోమశేఖర శర్మగారు తెలిపారు.

కవిసన్మానం

ఈ మహాసభ సందర్భంలో మాధవపెద్ది బుచ్చి సుందరరామశాస్త్రి, తుమ్మల సీతారామమూర్తి, ఏటుకూరి వెంకటనరసయ్య, పులవర్తి శరభాచార్యులు, చింతా దీక్షితులుగార్లకు నవ్యసాహిత్య పరిషత్తువారు చేసిన సన్మానానికి పరిషత్తువారిని ఆంధ్రులందరూ అభినందిస్తారు. సన్మానితులైన యీ కవులు రసవత్తరమైన సాహిత్యాన్ని సృష్టించి, తెలుగు సరస్వతి మన్ననలకు పాత్రులైనారు. వీరిలో ముఖ్యంగా చింతా దీక్షితులుగారు మధ్యతరగతి జీవితాన్ని వివిధదృక్కోణాలనుండి పరిశీలించి చక్కని కథలు వ్రాసినవారు; హృద్యమైన బాలవాఙ్మయాన్ని సృష్టించినవారు; నవ్యసాహిత్య నిర్మాణానికి విశేషంగా తోడుపడ్డ మేటిరచయిత దీక్షితులుగారు.

ప్రసిద్ధులైన యిటువంటివారినే కాకుండా పేటికలోవున్న రత్నాల్లాగ అజ్ఞాతంగావున్న సాహితీసేవకులను ముందుకు తీసుకొనివచ్చి ప్రోత్సహించి తెలుగుసాహిత్యాన్ని నవ్యసాహిత్య పరిషత్తు పెంపొందించగలదని ఆంధ్రులు ఆశిస్తున్నారు.

నవ్యసాహిత్య పరిషత్ మహాసభ కార్యక్రమం మహారాజుల ఆదరాభిమానాల్లో మెసలిన ఆంధ్రసాహిత్య సల్లాపాల్ని జ్ఞప్తికి తెచ్చింది. వేదఘోషలు, పన్నీటి జల్లులు, సుగంధలేపనాలు, ఫలప్రదానాలు, తిలకాలంకరణలు, పూలవిసురులు, బాలీసులు, ఆశీంతలు - యివన్నీచూస్తే వెనకకు నడిచి, రెండువందల సంవత్సరాలు వెళ్ళి, యేమహారాజు కొలువులోనో కవులు విహరిస్తున్నారా అనిపిస్తుంది. ఇష్టంలేనివారు సైతం ప్రజాసాహిత్యంకావాలని అనక తప్పని యిరవైయ్యవ శతాబ్దమేనా, బాహ్యాడంబరం కంటె భావమే ప్రధానమని ఒప్పుకోక తప్పని యిరవైయ్యోశతాబ్దంలోనే మనం వుంటున్నది అనిపిస్తుంది. చిరకాలానికి సమకూరిన కుటుంబ సమ్మేళనంలాగా యెంతో సౌభ్రాతృత్వంతో, కలుపుగోలుతనంతో ముచ్చటగా, మురిపెంగా మహాసభ ముగిసింది.

కాని ఫలితం ?

కాని యీ మహాసభ ఫలితం ఏమిటి?

నిరాశతో నిస్తబ్ధమైవున్న దేశానికిగాని, మన సాహిత్యానికిగాని, మహాసభవల్ల ఏమైనా ప్రయోజనం వుందా?

వినండి - మహాసభాధ్యక్షులైన కాటూరి వెంకటేశ్వరరావుగారు జవాబు చెపుతున్నారు:

"నవ్యసాహిత్య పరిషత్తు ఏం చేయాలో తెలదు!"

కాటూరివారు సాహిత్య ప్రయోజనవాది కాదు.

అయినా ఆయనకు సైతం కార్యక్రమమన్నది లేకుండానే గుమిగూడి, తరవాత చెదరిపోయిన పరిషత్తు సమావేశం యేదో అనిపించి, "నవ్యసాహిత్య పరిషత్తు ఏం చేయాలో తెలలేదు." అని గొణుక్కునేటట్టు చేసింది.

పరిణామంలో పరిషత్తు

ఎవరన్నా యే సంస్థనన్నా నిర్మించారంటే యేదో ఒకప్రయోజనాన్ని ఆశించి నిర్మిస్తారు. ఏదో ఒకలక్ష్యాన్నియేర్పరచుకొని, దానికై తపస్సు చేస్తారు.

అలాగే నవ్యసాహిత్య నిర్మాణం ప్రయోజనంగా పెట్టుకొని నవ్యసాహిత్య పరిషత్తు నిర్మింపబడింది. నవ్యసాహిత్య సృష్టికి అనల్పంగా సేవచేసింది. కందుకూరి, గిడుగు, గురజాడవారు వెలిగించిన జ్యోతిని తెలుగుజాతికి చూపింది.

వేలసంఖ్యలో తెలుగు పాఠకులకు సాహిత్య పిపాస కలిగించింది. ప్రజా విజ్ఞానాభివృద్ధికి, ప్రజా ఉద్యమాలకూ దోహదం చేసిన వ్యవహారికభాషను సుస్థిరం చేయడానికి తోడ్పడింది.

కాని - కాలవాహినితో ప్రవహించే ఓపికను, తరువాత పోగొట్టుకుంది నవ్యసాహిత్య పరిషత్తు.

తాను ఆదికవిగా పూజించిన గురజాడవారి సందేశాన్ని మరపుతెరలలో మరుగుపర్చింది.

ఒక మహత్తరమైన లక్ష్యాన్ని గురిపెట్టుకొని, ప్రారంభమైన వ్యవహారిక భాషోద్యమం ఒక ప్రయోజనంకోసమే అన్నసంగతి మర్చిపోయిందేమో అన్నంత కళావాదాన్ని సాహిత్యంలో స్థాపించింది.

తత్ఫలితంగా వాస్తవికాల జోలి మాకెందుకు, మేము కవులమేకాని, మనుష్యులతో సంబంధంలేదన్న దృక్పథం యేర్పడింది.

నిరాశాకరంగా యేర్పడుతూన్న దేశపరిస్థితులు నవకవుల మనస్థితిని [illegible]. అందుచేత వారికి తలదాచుకోవడానికి తావు కావలసి వచ్చింది. తావుకోసం వెదికేరు. వారికి తావు దొరికింది.

ఆదర్శవాదంలో, భావవాదంలో తావు దొరికింది. ఫలితం, ఒకప్పుడు జీవనదిగా ప్రవహించిన తెలుగుసాహిత్యం, నేడు చలనంలేని జలాశయంగా స్తంభించడం.

అందుచేతనే కృష్ణశాస్త్రిగారన్నట్టు సంఘానికీ సాహిత్యానికీ మధ్య గోడలు మొలిచేయి.

త్రోవ తప్పిపోయి తిరుగులాడిన బాటసారిలాగ సాహిత్యం సంచరించింది.

ఈ పరిస్థితుల్లో పాతపండిత సాహిత్యంపట్ల నవకవులకు అసంతృప్తి పుట్టినట్లే, నవకవుల నిస్తబ్ధతపట్ల కూడా అసంతృప్తి రేకెత్తింది. అందుచేత పరిషత్తును పత్రికలూ సాహిత్యపిపాసులూ విమర్శించారు.

గత సంవత్సరం సమావేశమైన నవ్యసాహిత్య పరిషత్తు మహాసభలో యీ అసంతృప్తి గొంతువిప్పింది. కాని అది నీరసంగా మాత్రమే వుంది.

కృష్ణశాస్త్రి ఉద్బోధ

కాని యిప్పటి మహాసభలో అది గంభీరంగా వినిపించింది.

"కవులు తమచుట్టూ గోడలుకట్టుకొని కూర్చోకుండా సంఘంతోపాటు అభ్యుదయకరాలైనదారుల్లో నడుస్తూ, దేశానికీ, సంఘానికీ మేలుచేసే రచనలనుచేసి తమ జీవితాన్ని సార్థకం చేసుకోవాలి.... ఇంతవరకూ నవ్యసాహిత్యపరిషత్తు నిర్దిష్టమైన ఒక కార్యక్రమంతో సంఘసేవ చేయకపోవడం శోచనీయం. ఇకమీదటనైనా ఇటువంటి నిస్తబ్ధతనుండి మేలుకొని సంఘానికి, సాహిత్యానికీ నవ్యసాహిత్య పరిషత్తు సేవచేస్తుందని ఆశిస్తున్నాము."

ఎంతో బాధతో గద్గదస్వరంతో మహాసభ వేదికనుండి కృష్ణశాస్త్రిగారన్న మాటలివి:

సాహిత్యపిపాసుల్లోను, చాలమంది పరిషత్తు సభ్యుల్లోను గుండెగొంతుకలో కొట్లాడుతూన్న భావంయిది:

అభ్యుదయ సాహిత్యంపట్ల యెటువంటి దృక్పథం వున్నప్పటికీ, సభావేదికనుండి మాటాడిన ప్రతిఒక్కరూ, ప్రజలకోసం సాహిత్యం రాయాలి. సంఘాభ్యుదయానికి సాహిత్యం తోడుపడాలి, అన్న భావాలను వెలిబుచ్చేరు.

కేవలం నావివరసలతో మెసలే ప్రాణస్నేహితుల కూటమిగా కాకుండా, నవ్యసాహిత్య పరిషత్తును విశాలమైన సంస్థగా నిర్మించాలి. అన్ని అభిప్రాయాలవారినీ పరిషత్తులోనికి ఆహ్వానించి సాహిత్యానికిసర్వతోముఖమైన అభ్యుదయాన్ని చేకూర్చాలి. ఆంధ్రసాహిత్యాభ్యుదయానికి యిది అత్యంతావశ్యకమైనదని నవ్యసాహిత్య పరిషత్తువారు గుర్తించాలి.

యుగధర్మం

కాలపరిస్థితులు జీవితంపైనీ, సాహిత్యంపైనీ విశేషంగా తమప్రభావాన్ని చూపెడుతున్నాయి. కవులు తాజ్‌మహల్ సౌందర్యాన్ని చూసి మురిసిపోవడమేకాదు; దాని నిర్మాణానికి రాళ్ళెత్తిన కూలీ లెవ్వరో కూడా తెలుసుకో గోరుతున్నారు.

ఇది యుగధర్మం.

ఈ యుగధర్మాన్ని విస్మరించి సాహిత్యాన్ని ఒక అలవాటుగా, జీవితాన్ని వెలివేసిన కళగా భావించేవారు, నేలవిడిచి సాము చేసినవారవుతారు.

కృష్ణశాస్త్రిగారు అన్నట్టు, "జీవితాన్నీ, సాహిత్యాన్నీ వేరుచేసిన గోడలను పడగొట్టాలి."

చిన్న కథ

చర్చిల్ అత్తగారు

అల్లుడు అత్తగారింటికి వెళ్తూ వెంట ఒకస్నేహితుణ్ణి కూడా తీసుకువెళ్ళాడట. భోజనానికి ఇద్దరూ కూర్చోగానే అత్తగారు అన్నం, పచ్చడీ వడ్డించి, నేతిగిన్ని చేత్తోపట్టుకు వచ్చి, అప్పుడు గిన్నెలోకి చూచి, "అయ్యో, చేతిమీదికి వేదామంటే అల్లుడికి నెయ్యీలేదు, అల్లుడి స్నేహితుడికి నూనైనాలేదు" అన్నదట. ఆ స్నేహితుడు నమస్కరించి, "అమ్మా, నాకు అసలు నూని పడదు, ఆ లేదనేదేదో నాకూ నెయ్యే లేదనరాదా" అని ఘోషించాడట.

అత్తగారి నెయ్యిలాగ అట్లాంటిక్ చార్టరనేదే ఖాళీ అబద్ధమైననాడు అది భారతదేశానికి వర్తించదు అని ఇన్నాళ్లూ చర్చిల్ ఘోషించడంలో ఈఅత్తగారి తత్వం....? విచిత్రం!

— ముద్దుకృష్ణ

వచ్చే సంచికలో

ఆంధ్రరాష్ట్ర అభ్యుదయ రచయితల మహాసభ విశేషాలు — చిత్రాలతోసహా

జన్మతః ఆస్థిహక్కు రద్దుకాగూడదు

భారతదేశంలో మితాక్షరన్యాయం, దాయభాగన్యాయం అనే రెండు ఆస్థి వారసత్వ సంక్రమణ విధానాలు అమలులో ఉన్నవి. దాయభాగన్యాయం ఒక్క బెంగాలులోనే వర్తించుతుంది. మిగతా భారతదేశం అంతటిలోనూ మితాక్షరన్యాయమే అమలులో ఉంది. హిందూలాను చట్టరూపంలో వ్రాయడానికి ప్రభుత్వంచే ఏర్పరుపబడిన బి. యన్. రావు కమిటీ,తనచిత్తుచట్టంలో మితాక్షరన్యాయాన్ని రద్దుచేసి, ఒక్క బెంగాలులోమాత్రమే ప్రస్తుతం అమలులోనున్న దాయభాగన్యాయాన్ని యావద్భారతదేశానికి అన్వయింపజేసింది.

మితాక్షరన్యాయం ప్రకారం పిత్రార్జితపు ఆస్థినుంచి, తండ్రి బ్రతికిఉండగానే కుమారుడు పంచుకోవచ్చును. కుమాళ్ళ ఇష్టం లేకుండా తండ్రి అట్టి ఆస్థిని అన్యాక్రాంతం చేయ వీలులేదు.

దాయభాగన్యాయం ప్రకారం, తండ్రియొక్క ఆస్థికి జన్మతః కుమారుడు హక్కుదారుకాడు. తండ్రియే ఆస్థికి సర్వహక్కుదారు. తండ్రి, కుమాళ్ళ యిష్టంలేకుండానే, తన యిష్టం వచ్చినవారికి సంక్రమింపజేయవచ్చును. తండ్రి ఏవిధమైన విల్లువ్రాయకుండా చనిపోయినప్పుడే, కుమాళ్లకు ఆ ఆస్థిని పంచుకునే హక్కుఉంది.

తండ్రి ఆస్థిలో జన్మతఃహక్కు ఉండుటవల్ల, ప్రతివ్యక్తి స్వయంకృషిమీద ఆధారపడాలసిన అవుసరం ఉండదనీ, అందువల్ల కుటుంబపుఆస్థినే అంటిపట్టుకు ఉంటున్నారనీ, అటువంటి హక్కును రద్దుచేస్తే ప్రతివ్యక్తి స్వయంకృషివల్ల అభివృద్ధి అవుతాడనీ, కొందరు వాదిస్తూ, దాయభాగన్యాయాన్ని సమర్థించుతున్నారు. పైదానితోపాటుమరికొందరు, దేశాభివృద్ధికి పరిశ్రమలు అభివృద్ధిగావాలనీ, అందుకు పెట్టుబడి కేంద్రీకరణ అవుసరమనీ, జన్మతఃహక్కు ఉండేట్లయితే, ఆస్థి ఇంకా చిన్న చిన్న భాగాలుగా అయిపోతుందనీ, భూములు ముక్కలై పోతే ఉత్పత్తి తగ్గిపోతుందనీ, చెబుతున్నారు.

మనదేశం పారిశ్రామికంగా ఎంతో వెనుకబడివుంది. అందుచే 100 కి 75 మంది వ్యవసాయంమీదనే ఆధారపడాలిసివస్తోంది. రాజగోపాలాచారిగారు ఈ మధ్య నాగపూరు విశ్వవిద్యాలయ స్నాతకోపన్యాసంలో చెప్పినట్లుగా 100 కి 75 మంది కాలేజీ విద్యార్థులకు ఉద్యోగాలే దొరకడంలేదు. అందుచే, చదువుకున్నవారు పైతం చాలమంది పిత్రార్జితపు ఆస్థిని అంటిపట్టుకుఉండటమో, లేక నిరుద్యోగంతో బాధపడటమో జరుగుతోంది. పరిశ్రమలు అభివృద్ధి కాకపోవడంవల్ల సామాన్యులుగూడ భూమిమీదనే ఆధారపడి జీవిస్తున్నారు. మనదేశంలో పరిశ్రమలు అభివృద్ధిఅయితే, కొత్త వృత్తులలో ప్రవేశించడానికి అవకాశాలు ఏర్పడతాయి. పరిశ్రమల అభివృద్ధితో ప్రజల ఆదాయం, దానితోబాటు జీవితపరిమాణం పెరుగుతాయి. అందుచే ఎంతోమంది డాక్టర్లు, ఉపాధ్యాయులు మొదలైనవారు అవుసరమవుతారు. ప్రతివ్యక్తి స్వయంకృషి చేయడానికి తగిన అవకాశాలు లేకపోవడం మూలాన, విద్యావంతులుపైతం, పిత్రార్జితపు ఆస్థిమీద ఆధారపడుతున్నారు. అంతేగాని తండ్రిఆస్థిని పంచుకోడానికి ఉన్న హక్కువలనమాత్రం సోమరిపోతులుగా కూర్చోడంలేదు. అందుచే ప్రతివ్యక్తి స్వయం కృషిచేసి అభివృద్ధిఅవడానికి ముందుగా పరిశ్రమలు అభివృద్ధి అవ్వాలి.

ఈపరిస్థితులలో జన్మతః వచ్చే ఆస్థిహక్కును రద్దుచేయడమంటే, ఒకవ్యక్తిని స్వయంకృషికి ప్రోత్సహించకపోవడమేగాక, ఇంకా ఎక్కువగా అతని వ్యక్తిత్వాన్ని చంపివేయడంగూడ అవుతుంది. ఎందువల్లనంటే, వేరేవృత్తులకు అవకాశాలు లేకపోవుటవలన, పిత్రార్జితపు ఆస్థికే అంటిపట్టుకు ఉండాలిసివస్తుంది. తండ్రి చనిపోయేవరకూ నోరు తెరుచుకు కూర్చుంటారు. ఈలోగా తండ్రి పక్షపాతపు దృష్టికలవాడైతే తనకు ఎక్కువ మక్కువఉన్న కుమారునికో, కుమార్తెకో విల్లుద్వారా ఆస్థిని సంక్రమింపజేయవచ్చును. తన కయిష్టుడైన కుమారునికి, లేక కుమార్తె నోట్లో గడ్డ కొట్టవచ్చును. దుర్వ్యసన పరుడైతే ఆస్థిని తాగుడు, జూదం వగైరాలకు తగలవేయవచ్చును. అందుచే జన్మతః ఆస్థిహక్కు లేకపోతే, కుమారుడు పైవాటన్నిటికిసహించి, వ్యక్తిత్వాన్నిచంపుకొని, సమిష్టికుటుంబంలో క్రుగ్గిపోవాలిసివస్తుంది. జన్మతః హక్కు తీసివేయడంవల్లలో పభూయిష్టమైన సమిష్టి కుటుంబ విధానం ఇంకా బలపడుతుంది. కుటుంబాలలో తగాదాలు ఇంకా ఎక్కువ అవుతాయి. వ్యక్తిస్వేచ్ఛను,అభివృద్ధినిఅరికడుతుంది. అందుచే దేశాభ్యుదయానికిహానికరం. కనుక ఇప్పుడు కుమాళ్ళకు తండ్రిఆస్థిలో జన్మతః ఉన్న హక్కును కుమార్తెలకుగూడ యివ్వటం న్యాయం; దేశానికి క్షేమం.

కుమాళ్ళకేగాక కుమార్తెలకు గూడ ఆస్థి సంక్రమించితే, ఆస్థి ముక్కలు ముక్కలైపోవుటవల్లన పారిశ్రామికాభివృద్ధి జరగదనే వాదనను పరిశీలించుదాం. పరిశ్రమలు అభివృద్ధి గాకపోవడానికి అసలు కారణం మన దేశానికి స్వాతంత్ర్యం లేకపోవడమేగాని, జన్మతః ఆస్థి పంపిణీ హక్కు ఉండటంగాదు. దేశంలో పెట్టుబడి కావలసినంత మూలుగుతూంది. ఈపెట్టుబడితో పరిశ్రమలు ఏర్పరచడానికి బ్రిటిషు సామ్రాజ్యవాదులు అనేకవిధాల అడ్డుతగులుతున్నారు. భారతీయులు ఎంత ఆందోళనచేస్తున్నా, నౌకానిర్మాణానికి, ఏరోప్లేన్, మోటారుకారు ఫ్యాక్టరీల నిర్మాణానికి, అడ్డుతగలడం అందరం ఎరిగిన విషయమే. అందుచే పరిశ్రమలు అభివృద్ధిగావాలంటే, ముందు కాంగ్రెసు లీగు ఐక్యత సాధించి స్వాతంత్ర్యాన్ని సంపాదించాలి.

ఆస్థిపంపిణీ విధానంవల్ల భూమి చిన్న చిన్న ముక్కలైపోయి, పంటలు తగ్గిపోతాయనే విషయం ఎంతవరకు సరియైనదో చూదాం. మనదేశంలో పరిశ్రమలు అభివృద్ధి గాకపోవడంవలన, కృత్రిమ ఎరువులు వేయడం, ఆధునిక వ్యవసాయ పనిముట్లను ఉపయోగించడం జరగడంలేదు. అందువలన 100 యకరాల రైతు 2 యకరాల బీదరైతు కన్న ఎక్కువ పంట పండించలేకుండా ఉన్నాడు. ఎక్కువ పంటలు పండించాలంటే, మన దేశంలో ఎరువుల ఫాక్టరీలను, ఆధునిక వ్యవసాయ పనిముట్లను తయారుచేసే ఫ్యాక్టరీలను విరివిగా నిర్మించి, వాటిని రైతులకు చౌకగా అందు బాటులో ఉండేలాగున చెయ్యాలి. బీదరైతులకు ప్రభుత్వం చౌకవడ్డీలతో అప్పులు విరివిగాఇచ్చి, వారు ఆధునిక పద్ధతులు అవలంబించేలా చేయాలి.

సహకారపద్ధతుల (కోఆపరేటివ్ సొసయిటీలు) ద్వారా ఆధునిక వ్యవసాయ పనిముట్లను ఉపయోగించి సమిష్టి వ్యవసాయం సాగించేటట్లు ప్రోత్సహించాలి. పరిశ్రమలు అభివృద్ధి అయి, వేరేవృత్తులకు అవకాశం ఉంటే, భూమి మీద కొంతవత్తిడి తగ్గుతుంది. అందువల్ల భూమి పంపిణీలద్వారా చీలికలవడం కొంతవరకు తగ్గుతుంది. ఆధునిక సహకారపద్ధతులద్వారా ప్రభుత్వ సహాయంతో సమిష్టి వ్యవసాయాన్ని సాగించితే, ఆధునిక వ్యవసాయ యంత్రాలను ఉపయోగించవచ్చును, వ్యవసాయ ఖర్చులు పోను మిగతా ఆదాయం వారి వారి భూముల విస్తీర్ణాన్నిబట్టి ఆదాయాన్ని పంచుకోవచ్చును. పంటలు ఎక్కువగా పండించడానికి పైన సూచించింది సరియైన మార్గంగాని, జన్మతః ఉన్న ఆస్థిహక్కు తీసివేయడం మాత్రం గాదు.

ఇప్పటికన్న ఎక్కువగా పంటలు పండించడానికి మార్గంపైచెప్పబడిన విధానమేగాని మరొకమార్గంకాదు.

జన్మతః ఉన్న ఆస్థిహక్కును తీసివేయడం వల్ల మనదేశం అభివృద్ధి చెందదు. జన్మతః ఆస్థిహక్కును కుమాళ్ళకేగాక కుమార్తెలకుగూడకల్గించితే, వ్యక్తిస్వేచ్ఛకు, అభివృద్ధికి ఇంకా అవకాశాలు ఎక్కువ అవుతాయి. దేశంగూడ స్వాతంత్ర్య లక్ష్యం వైపుకు ముందుకుసాగడానికి తోడ్పడుతుంది.

— చంద్ర రాజేశ్వరరావు

★ వివిధవార్తలు

శ్రీ ధర్మవరం కృష్ణమాచార్య వర్ధంతి సభలు

బెజవాడఅభ్యుదయరచయితలసంఘయాజమాన్యాన శ్రీ కృష్ణమాచార్యులుగారి 33 వ వర్ధంతి పాటిబండ మాధవశర్మగారి అధ్యక్షత క్రింద రామమోహన గ్రంధాలయ హాలులో 13-12-44 న జరిగింది. సభకు 200 మంది హాజరైనారు. అధ్యక్షులు ప్రసంగిస్తూ, ఆంధ్ర సాహిత్యమంతా పురాణప్రబంధాల్లో మునిగి తేలుతున్నపుడు కృష్ణమాచారిగారు నాటక రచనకు పూనుకున్నారని చెప్పారు. ఆచార్లవారి నాటకాలు బహుముఖంగా ఉంటాయి. విషాదాంతనాటకాలను తెలుగువాఙ్మయంలో అందించినవారిలో వీరే ప్రప్రథములు. ప్రబంధాలకు, నవీన నాటకాలకు మధ్య సంధి యుగంలో ఆచార్లవారు యుగకర్త అని చెప్పాలి. అంటూ అధ్యక్షు ఉపన్యసించారు.

శతావధాని దోమ వెంకటస్వామిగుప్త గారు మాట్లాడుతూ, ఆచార్యులవారు తమ జీవితాన్ని ప్రజోపయోగమైన కళలకు అంకితం చేశారని వెలిబుచ్చారు. శ్రీవైష్ణవులైనా, ఆచార్లగారికి మతద్వేషం ఉండేదికాదనీ, సర్వజనాదరణీయమైన వీరి నాటకాలు చూచుటకు దూరప్రదేశాలనుంచి కూడా ప్రజలు హాజరౌతుండేవారని గుప్తగారు ప్రశంసిస్తూ ఉపన్యాసాన్ని ముగించారు.

శ్రీ విశ్వనాథ సత్యనారాయణగారు ఉపన్యసిస్తూ, నాటకరచనలోను, అభినయంలోను ఆచార్యులవారిదే అగ్రతాంబూల మన్నారు.

గుంటూరు థియసాఫికల్ భవనంలో అభ్యుదయ రచయితలసంఘం, సరస సారస్వత సమితి యాజమాన్యాన ఆంధ్రనాటక కవితా పితామహుని వర్ధంతి జయప్రదంగా జరిగింది. శారదానికేతన ప్రధానాచార్యులు శ్రీ వాసిలాల సోమయాజులుగారు అధ్యక్షత వహించారు. శ్రీ జంధ్యాల పాపయ్యశాస్త్రి గారు ఉపన్యసిస్తూ విషాదాంతకావ్యాల ప్రాముఖ్యాన్ని వివరించారు. శ్రీ అక్కిరాజు సూర్యనారాయణగారు నాట్యకళనుగూర్చి శాస్త్రీయమైన వివరణ చేశారు. హిందూకళాశాల ఉపన్యాసకులు శ్రీ పిల్లలమర్రి హనుమంతరావు గారు ఆచార్యులవారి నాటకాల ప్రాశస్త్యాన్ని వివరిస్తూ, వారు కొన్ని ప్రబంధాలు కూడా వ్రాశారనీ, అవి యేకారణంవల్లనో బయల్పడలేదనీ చెప్పారు. గుంటూరు నాట్యసమితి దర్శకులు శ్రీ పాతూరి శ్రీరామశాస్త్రి (M.Sc.) గారు ఆచార్లగారి రచనా వైశిష్ట్యాన్ని ప్రశంసిస్తూ, ఆంధ్రనాటకరంగం యెలా అభివృద్ధి చెందుతున్నదీ వివరించారు.

అధ్యక్షులు తమగంభీరోపన్యాసంలో నాటకకళ - దాని పుట్టుపూర్వోత్తరాలు చర్చించి, అది నానాటికి ప్రజాభిరుచిని బట్టి యెలా మార్పుచెందుతూ వచ్చిందో వివరించారు. అనంతరం, విశ్వవిద్యాలయ కళాశాలా విద్యార్థులు ప్రతాపరుద్రీయంలోని రెండు రంగాలను శ్రీ ఆచార్యులవారి గౌరవార్థం ప్రదర్శించారు.

అంతర్వేదిపాలెంలో కూడా శ్రీకృష్ణమాచార్యులవారివర్ధంత్యుత్సవం రాజోలుతాలూకా అభ్యుదయరచయితల సంఘ యాజమాన్యాన జయప్రదంగా జరిగింది. నాట్యకళోపాసకులు శ్రీ కె. దనలక్ష్మినాయుడుగారు అధ్యక్షత వహించారు. శ్రీ యస్. ఆర్. దంతులూరి, శ్రీ ఎ. వెంకటరామరాజుగార్లు ఆచార్యులవారి నాటకరచనా ప్రతిభను ప్రశంసిస్తూ ఉపన్యసించారు.

శ్రీ అప్పారాయకవి చిత్రపటావిష్కరణ

కాకినాడ విజ్ఞానమండలి తృతీయ వార్షికోత్సవ సందర్భంలో 17-12-44 తేదీన శ్రీ భమిడిపాటి కామేశ్వరరావుగారి అధ్యక్షతను కాకినాడ పి. ఆర్. కాలేజీ భవనంలో సభ జరిగింది.

శ్రీ గురజాడ అప్పారాయ చిత్రపటాన్ని ఆవిష్కరణచేస్తూ, అధ్యక్షులు అప్పారాయ కవి రచించిన గ్రంథాలను ప్రశంసిస్తూ మాట్లాడారు. అప్పారాయ కవిని గురించి మాటాడడమంటే విసుగనేదిలేదనీ, ఆయన వ్రాసిన ముత్యాలసరాలు, కన్యాశుల్కనాటకం, మొదలైనవి చదువుతూంటే, కొత్త కొత్త రుచులూరుతూ, ఉత్సాహాన్ని ఉత్తేజాన్ని కలిగిస్తాయనీ అన్నారు. ప్రత్యేకించి కన్యాశుల్కం పీతిబోధకమనీ, సంఘ సంస్కారమునకు సహాయపడేదనీ ముచ్చటించారు.

శ్రీ ఇంద్రకంటి హనుమచ్ఛాస్త్రిగారు అప్పారావుగారి చిత్రపటాన్ని వ్రాసిన శ్రీ దాసు సుబ్బరాయశర్మగారిని సభవారికి పరిచయంచేస్తూ, కళారాధకులు ప్రజా జీవితాన్ని వాస్తవరూపంలో కండ్లకుకట్టే రీతిగా చిత్రించాలనీ, అట్టికళను ప్రజలు సర్వవిధాలా పోషించి, ప్రోత్సాహ (మిగతా 7 వ పేజీలో)

ప్రజాసంస్థలనిధికి వరికోతలు

"వచ్చవచ్చగ పెరిగి పండి వరుగున్నాను" అని క్షేత్రలక్ష్మి ఆహ్వానించే రోజులివి. నిజంగా పండుగరోజులివి. నిత్యమూ ఒక ఏకాదశిగా గడిపిన కార్తికమాసాలుపోయాయి. కూలీలకు కొంతదబ్బు గిట్టేరోజులువచ్చాయి. రైతులు తమ కాయకష్టం ఫలించినందుకు ఉప్పొంగే పర్వదినాలు వచ్చాయి.

తమకోసం, తమ జాతికోసం, దేశంకోసం పాటుబడుతున్న ప్రజాసంస్థల్ని రైతులు, పోషించుకోవాలి. అందుకిదే మంచితరుణం. ఎంతబీదవాడైనా, ముంగిట ధనలక్ష్మి ఒక్కక్షణం చూచి తళుక్కున మెరసిపోయే రోజులివి. అందుచేతనే ప్రజాసంస్థల పోషించడానికి, రైతులు, కూలీలు స్త్రీ పురుషభేదం లేక, ఆబాలగోపాలమూ మహోత్సాహంతో కోతలకు బయలుదేరారు. ఆకోతలలో వచ్చిన కష్టార్జితాన్ని తమతమ ప్రజాసంస్థలకు విరాళాలుగా ఇచ్చారు.

దావులూరు (గుంటూరుజిల్లా) వ్యవసాయ కూలీ ఉద్యమానికి పుట్టినిల్లు. చైతన్యమందిన ఆ వ్యవసాయకూలీలు జిల్లాకంతకూ ఆదర్శప్రాయంగా పనిచేస్తున్నారు. కూలీల ఈఉద్యమానికున్నంత స్థాయికి రైతాంగం రాలేకపోయింది. కారణం, అక్కడిస్థానిక పెత్తందారులు కొందరు తమ స్వార్థంకోసం రైతులలో చీలికలుదెచ్చి, తమచెప్పుచేతుల్లో ఉంచుకోడమే. కాని ఇటీవల కరోపిన్ మొదలగు సమస్యలను పరిష్కరించుకోడం ద్వారా, రైతాంగమూ గ్రామస్థులందరూ ఒక్కతాటిమీద నడుస్తున్నారు. ఏకొద్దిమందో తప్ప మిగిలిన గ్రామస్థులంతా ఐక్యత అవసరాన్ని గుర్తించారు.

ఈ నూతన చైతన్యంతో ఉత్సాహభరితులైన రైతులూ, కూలీలు రైతుసంఘ నిధికి గామ వరికోతకు బయలుదేరారు. 100 మంది వ్యవసాయకూలీలు, 70 మంది రైతులూ కోతలో పాల్గొన్నారు. ఇందులో ముస్లింలు, [illegible]లు కూడా వున్నారు. మహిళలు, బాలసంఘ సభ్యులుకూడా పాల్గొన్నారు. తాలూకా రైతుసంఘ నాయకులైన రావి అమ్మయ్యగారు, జిల్లా మహిళాసంఘ నాయకురాలైన నాళమూరికోటమ్మగారు, కోటీశ్వరమ్మగారు కోతలో పాల్గొని, వారిసందరినీ ఉత్సాహపరిచారు. ఒకప్రక్క బుర్రకథ, మరొకప్రక్క రైతు - కూలీ గీతాలతో కోత సాగిపోయింది. ఈ సంరంభం అంతా చూసి 3 ముఠాల పనివాళ్ళు తమ పనిమానివచ్చారు. మరొకచోట వేస్తూ వేస్తూ ఉన్న గూడు మానివేసి, కోతలో పాల్గొన్నారు. మొత్తం 8 ఎకరాల కోతకోసి, రైతుసంఘానికి 50 రూపాయలు సంపాదించి యిచ్చారు.

ఆంధ్రరాష్ట్ర రైతుమహాసభ గుంటూరు జిల్లాలో జరుగనుంది. ఆ మహాసభకు అయ్యే ఖర్చులకుగాను నిధిని సమర్పించదలచారు రైతులూ కూలీలు. వారికి తోడుగా యువకులు, మహిళలు, బాలసంఘ సభ్యులు నిలిచారు. ఊరేగింపులతో, బుర్రకథలతో పాటలతో మహోత్సవంగా వందలకొలది జనులు కోతకు పూనుకున్నారు. కొల్లిపర, తెనాలి, కొల్లూరు, చదలవాడ (ఇవన్నీ తెనాలితాలూకాకు చెందిన గ్రామాలు) గ్రామాలలో ప్రజలు ఈ మహోత్సవాన్నిజూచి విస్తుపోయారు. ఈ గ్రామాలలో 179 రూపాయలు రైతుమహాసభకు సంపాదించారు.

కాటూరు సమీపంలోని నాగన్నగూడెంలో కూడ అతివైభవంగా ప్రభాత్‌ఫేరీ ఊరేగింపులు జరిగాయి. 40 మంది పురుషులు, 5 గురు స్త్రీలు, 10 మంది బాలబాలికలు ఇందులో పాల్గొన్నారు. చేనుచుట్టూ ఎర్రజండాలు రెపరెపలాడుతూ ఉత్సాహాన్ని పురిగొల్పాయి. ఆరోజున తమకు వచ్చిన కూలినంతా తమ కూలీసంఘానికి ఇచ్చారు.

కష్టజీవులపార్టీ కమ్యూనిస్టుపార్టీ. ప్రజాసంస్థలకు నాయకత్వం వహించి దైనందిన సమస్యలను పరిష్కరించుతూ పనిచేస్తోంది. స్వాతంత్ర్యపిపాస జనసామాన్యంలో రేకెత్తించుతూంది. అలాంటి పార్టీకి కొన్నిగ్రామాలలో ఈ కోతలు మొదలగు వ్యవసాయపు పనులద్వారా నిధిని పోగుచేశారు. కాటూరులో 60 మంది 7 ఎకరాలలో కట్టివేతవేసి 118 రూపాయలు సంపాదించారు. గ్రామ మహిళలీ పనిలో పాల్గొని సహాయపడటం ఎంతో సంతసించవలసిన విషయం. ఇదే గ్రామంలో గ్రామ మహిళా సంఘం తరఫున 40 మంది స్త్రీలు వరుసగా నాల్గురోజులు వరికోతలలో పాల్గొన్నారు. స్త్రీలు పొలం పనిచేసికోడంతప్పనే అభిప్రాయాన్ని పోగొట్టారు. కొంతమంది స్త్రీలు తమకు ఒకరోజున వచ్చేకూలిని పార్టీఫండుకు ఇచ్చారు. ఇలాంటి త్యాగం ఎంత ప్రశంసనీయం!

ఇలాగే వల్లెకోన, బేతపూడి, బెల్లంవారిపాలెం గ్రామాల (గుంటూరుజిల్లా) రైతు - కూలీ యువకులు, విద్యార్థులు నూతనసాంప్రదాయాన్ని నెలకొల్పారు. కోతలద్వారా తాము కష్టించి ఆర్జించిన ధనాన్ని తమకు బాసటగా నిలచిన కమ్యూనిస్టుపార్టీ ఫండుకు విరాళమిచ్చారు.

శిల్పకళాశాల స్థాపనకై విరాళాలు

శ్రీ నాగార్జునవిజ్ఞానసమితి, ప్రెసిడెంటు శ్రీ దిడుగు గోపాలకృష్ణమూర్తి బి ఏ.బి.ఎల్. గారి అధ్యక్షతను మాచెర్లలో సమావేశమై శిల్పకళాశాలను స్థాపించుటకు ద్రవ్యమును సేకరించుటకై నిర్ణయము తీసుకున్నది.

డిసెంబరు 8 వ తేదీన సమితి కార్యవర్గం వారగు శ్రీ కోలవెన్ను రామకోటేశ్వరరావు ఎం. ఎల్. ఏ., బెల్లంకొండ శివరామయ్య బి. ఎ. బి ఎల్. వట్టికొండ రామయ్య, నాళం మట్టపల్లి, కజ్జం బాలకోటయ్య, మారం పెదగాలెయ్య, పోలేటి వెంకటసుబ్బయ్య, గుజ్జము మల్లయ్య, సూరపరాజు గోపాలకృష్ణయ్యగార్లు మాచెర్ల పురప్రముఖులను సమావేశపరచి, శిల్పకళాశాలను స్థాపించవలసిన ఆవశ్యకతను తెలియజేసి, విరాళములకై విజ్ఞప్తిచేయగా, షుమారు రు. 2000/- వాగ్దానాలు వచ్చాయి.

(రు. 50/-లకు పైగా యిస్తామన్నవారు)

1. శ్రీ యిమ్మడిశెట్టి బిక్షపతిగారు రు. 216/-
2. ,, కజ్జం బాలకోటయ్యగాడు 116/-
3. ,, కంభంపాటిపెదమల్లయ్యగారు 116/-
4. ,, చుండూరి కృష్ణయ్య, ,, ఆత్మకూరి గోవయ్య } గార్లు 116/-
5. ,, మురారిశెట్టిరంగనాయకులు, ,, మారం పెదగాలెయ్య } గార్లు రు. 116/-
6. ,, కొప్పురావూరి నాగభూషణంగారు 116/-
7. ,, కర్ణాటి వెంకట చలమయ్యగారు 58/-

తతిమ్మావారు రు. 50/- లకు విరాళములు వేసినారు. ఇవిగాక నాపరాయి వర్తకుల నెలసరి విరాళాలు కూడా ఉన్నాయి.

పల్నాడు తాలూకా యందలి యితర గ్రామములలో గూడా ప్రచారంచేసి, యిచ్చటనే షుమారు రు. 10 000 ల వరకు విరాళములు పోగుచేయ నిశ్చయించారు.

ఆంధ్రమహాజనులు యీ శిల్పకళాశాల స్థాపనకు తగిన ప్రోత్సాహమిస్తారని ఆశిస్తున్నాము.

గుజ్జము మల్లయ్య, కార్యదర్శి.
సూరపరాజు గోపాలకృష్ణయ్య,
సహాయకార్యదర్శి.
శ్రీ నాగార్జున విజ్ఞాన సమితి.

కాంగ్రెసు నాయకునికి ఆహ్వానం

నర్సాపురం తాలూకా కాంగ్రెసు సంఘాధ్యక్షులైన ఇందుకూరి సత్యనారాయణరాజుగారు 2 సం॥ పైగా కారాగార శిక్ష ననుభవించి, విడుదలై తమ స్వగ్రామమైన పండితవిల్లూరు విచ్చేసిన సందర్భంలో గ్రామప్రజలు వారిని ఉత్సాహంతో ఆహ్వానించి, జాతీయ, ఎర్రజెండాలతో ఊరేగించారు. తాలూకారైతుసంఘాధ్యక్షులైన లక్ష్మీనరసింహరాజుగారి అధ్యక్షతను జరిగిన సభలో గ్రామ రైతు, కూలీ, యువజన విద్యార్థి, మహిళా, చేనేతపారిశ్రామిక, బాలసంఘాలవారు, కమ్యూనిస్టులు స్వాగతపత్రాలు సమర్పించారు. శ్రీ సత్యనారాయణరాజుగారు స్వాగతపత్రాలను స్వీకరిస్తూ, వివిధ ప్రజాసంఘాలకు బలపరచవలసినదిగా ప్రజలను హెచ్చరిస్తూ, ప్రస్తుత కరువు పరిస్థితులను విపులీకరిస్తూ, తమ కృతజ్ఞతను వెల్లడించారు.

★

అఖిలభారత చరఖా సంఘం (ఆంధ్రశాఖ) కనగాల బ్రాంచి మేనేజరైన శ్రీ కొల్లి బసవయ్యగారిలా వ్రాస్తున్నారు.

"గాంధీ - జిన్నా సంప్రతింపులు విఫలమైన తర్వాత దేశంలో విషమపరిస్థితు లేర్పడ్డాయి. కాంగ్రెస్‌లో కమ్యూనిస్టు లుండగూడదని సంయుక్తరాష్ట్ర, బొంబాయి, ఆంధ్ర ప్రముఖకాంగ్రెసువాదులు సమావేశమై కొన్ని తీర్మానాలు చేశారు. ప్రభుత్వం కాంగ్రెసు నాయకులను అరెస్టుచేసినప్పటినుండి, కాం[illegible]సు సాంప్రదాయాలను నిలబెట్టుతూ, కరువ[illegible]ను యెదుర్కొంటూ, కాంగ్రెసుమీద [illegible]చేసే దుష్ప్రచారాన్ని ఎదుర్కొంటూ [illegible]మ్యూనిస్టులను కాంగ్రెసునుండి [illegible] దేశశ్రేయస్సుకు మంచిదికాదు. [illegible]త్య వ్యతిరేకులు సంతోషంతో [illegible]రు. దేశం ఛిన్నాభిన్నమై [illegible]ధకాంగ్రెసువాదులు సభ్యత్వం [illegible] తెలుస్తూవుంది. ఇది [illegible]ంగ్రెసు ప్రజా సామాన్యం

కడప కాంగ్రెసువాదుల సభ

కడపజిల్లా కమ్యూనిస్టు కమిటీ కార్యదర్శియైన పి. నరసింహారెడ్డిగారు యిలా ప్రకటిస్తున్నారు:

గత డిశంబరు 10 వ తేదీన కె. కోటిరెడ్డిగారి (యం.యల్.ఏ.) అధ్యక్షతన కడపజిల్లా కాంగ్రెసువాదుల సమావేశం జరిగింది. కమ్యూనిస్టులుకూడా సభకు హాజరైనారు. కాంగ్రెసు అసెంబ్లీలలో కమ్యూనిస్టులు చేరవచ్చునా అనే మీమాంస బయల్దేరింది. పి. పార్థసారధిగారనే కాంగ్రెసువాది కమ్యూనిస్టులను అసెంబ్లీలలో చేర్చుకోగూడదనే అభ్యంతరాన్ని తెచ్చిపెట్టారు. అంతట నేను కమ్యూనిస్టులను చేర్చుకోగూడదనే వాదనకు సమాధానమిస్తూ, గాంధీజీచేసిన ప్రకటనలను తెలియజేసి, కమ్యూనిస్టులు కాంగ్రెసు అసెంబ్లీలలో చేరడం యెలా న్యాయబద్ధమో, స్పష్టపరచాను. శ్రీ కాశేశ్వరరావుగారి సంకుచిత విధానాన్ని బట్టబయలుచేశాను. గాంధీజీ సూచించిన 14 అంశాల నిర్మాణ కార్యక్రమాన్ని అనుసరించుటకు పూనుకున్న ప్రతిదేశభక్తునికి కాంగ్రెసు అసెంబ్లీలలో స్థానమున్నదని విశదంచేశాను. కాంగ్రెస్ అసెంబ్లీలలో కమ్యూనిస్టులు చేరగూడదనే అంశాన్ని నిర్ణయించడానికి అఖిలభారత కాంగ్రెసు సంఘమొక్కటే అధికారము కల్గియున్నదని తెలియజేశాను. పార్థసారధిగారుమినహా, తక్కిన కాంగ్రెసువాదులందరూ నేను సూచించిన అంశాల నంగీకరించారు. గాంధీజీనుంచి యీ విషయమై సలహాపొందుటకును, నిర్మాణ కార్యక్రమ నిర్వహణను గురించి వారి సూచనలు పొందుటకు కె. కోటిరెడ్డిగారిని గాంధీజీతో ఉత్తరప్రత్యుత్తరాలు జరుపుటకు తీర్మానింపబడ్డది.

యెన్నుకున్న కమిటీ ఉన్నప్పుడే, ప్రస్తుత పరిస్థితుల్లో దేశానికి సరియైన నాయకత్వం యేర్పడుతుంది. కనుక ఆంధ్ర కాంగ్రెసువాదులు తమ నిర్ణయాన్ని పునరాలోచించుతారని ఆశిస్తున్నాను."

పొలికేక

వలియ వలియో వలియ - రావేలుగలవాడ! రార పొలిగాడ!

ఎత్తరా నీ జండ - ఎర్రనీ జండ
ఎత్తెత్తు నీ సుత్తి - ఎత్తరా కత్తి
పగవారు తలతింప - జగతి కంపింప
పాడరా నీ పాట - బంగారుమూట ॥వలియ॥

వర్షురానిగజేసి - బస్తాలలోని
కరువుమంటలనార్పి - కష్టాలదీర్చి
కుచ్చులో యీతిండి - దొంగలాచెంది
కాపాడ రావలెను - కలసిదేశమును ॥వలియ॥

పెత్తనముపోవునని - భీతిల్లిమదిని
పెద్దగాగ్గొంతెత్తి - పిచ్చిరేకెత్తి
పెదమార్గములబట్టి - పిలుచుచున్నట్టి
స్వార్థులనుగనుమోయి - సరిజేయుమోయి ॥వ॥

పరప్రభుత్వపు బెత్తు - పడగొట్టుయెత్తు
జాతియైక్యతకన్న - సాధవమెదన[illegible]
అన్నదమ్ములగలిపి - ఐక[illegible]
మతభేదములవిచ్చి - [illegible]

కట్టుకట్టూబంతి - [illegible]
పొలిపోలో యని[illegible]
పరప్రభుత్వ[illegible]
జడిసి పరుగె[illegible]

★ యుద్ధసమీక్ష

బుడాపెస్టులో రెడార్మీ

గ్రీసులో బ్రిటిష్ లొంగుబాటు

హంగెరీ ముఖ్యపట్టణం బుడాపెస్టు ఎర్రసేనల చేతుల్లో చిక్కుకుంది. ఉత్తరంనుంచి తోసుకువచ్చిన మార్షల్ మాలినోవస్కీ సేనలు, దక్షిణంనుంచి ముందుకు వచ్చిన మార్షల్ టోల్బూఖిన్ సేనలు బుడాపెస్టుకు పడమటగా కలుసుకొని నగరాన్ని అన్ని వైపులనుంచి క్రమ్మేసినాయి. దీనితో జర్మనీకి వెలుపల మిగిలిన పెద్ద నాజీకేంద్రం రెడ్‌ఆర్మీ వ్యూహంలో చిక్కుపడింది. నగరంలోని నాజీమూకలను రెడ్‌ఆర్మీ ధ్వంసం గావిస్తోంది. లొంగుటకు నిరాకరించి వీధివీధిన పోరాడుతున్న నాజీహంతకుల శవాలు వేలకు వేలుగ బుడాపెస్టు సందుగొందులలో కుప్పలు కుప్పలుగా పడుతున్నాయి.

ఒకవైపున బుడాపెస్టు విధ్వంసనాన్ని సాగిస్తూనే, రెండోవైపునుంచి ఎర్రసేనలు ఆస్ట్రియా సరిహద్దులకు పరుగిడుతున్నాయి. టోల్బూఖిన్ సేనలు బుడాపెస్టుకు పడమటగా అనేక ముఖ్యపట్టణాలను ఆక్రమించి ఆస్ట్రియా సరిహద్దునకు 50 మైళ్ళలోకి చేరినాయి.

ఉత్తరాన జెకోస్లోవేకియాగుండా మాలినోవస్కీ సేనలు బ్రాటిస్లావాకు 40 మైళ్ళలోకి చేరుతున్నాయి. బ్రాటిస్లావా వియన్నాకు 30 మైళ్ళలోవున్నది. జెకోస్లొవేకియా, హంగెరీ, ఆస్ట్రియా సరిహద్దులు కలిసే ప్రదేశం ఇది.

నూతన విజృంభణతో సాగుతున్న యీ రెడ్‌ఆర్మీదాడులతో యుద్ధం జర్మనీ సరిహద్దులలోకే ప్రవేశిస్తోంది. పశ్చిమంనుంచి, దక్షిణంనుంచి, తూర్పునుంచి ఇక జర్మన్ భూమిమీదనే యుద్ధం జరిగే అవకాశం వచ్చింది.

హంగేరీ విముక్తి

హంగేరీలో రెడ్‌ఆర్మీ విజయాల ఫలితంగా హంగెరీప్రజలు శత్రువుపైకి లేస్తున్నారు. 1920 లో హంగెరియన్‌ప్రజావిప్లవం బ్రిటిష్ అమెరికన్ పెట్టుబడిదారుల సహాయంతో క్రూరంగా అణచబడినప్పటినుంచీ స్వాతంత్ర్యం కొరకు ఎదురుచూస్తున్న ప్రజలకు చివరకు విముక్తి వచ్చింది. నూతన ప్రజాప్రభుత్వం జెనరల్ మిక్లోస్ నాయకత్వం క్రింద ఏర్పడింది. నాజీలతో యుద్ధం ప్రకటించింది. ఫాసిస్టులు పూర్తిగా నాశనమయ్యేవరకు హంగెరియన్ ప్రజలందరూ, మిత్రమండలి దేశాలతోకలసి పోరుటకు, జర్మనీతో పోరుతున్న సోవియట్ మొదలైన దేశాలతో సంధిచేసికొనుటకు నిర్ణయించింది. ప్రజాస్వామ్య హక్కుల నన్నిటిని పునరుద్ధరించి, జర్మన్లతో సహకారంచేసిన ద్రోహులను శిక్షించుటకు, ఫేసిస్టు సంస్థల నన్నిటినీ నాశనం గావించుటకు, ప్రజాసామాన్యమునకు వెంటనే సహాయపడు ఆర్థికకార్యక్రమాన్ని కొనసాగించుటకు ఈ తాత్కాలిక ప్రభుత్వం నిర్ణయించింది.

పశ్చిమాన నాజీలు

తూర్పున నాజీల అపజయాలతోపాటు, పశ్చిమాన బెల్జియం లక్సెంబర్గులలోకి సాగిన నాజీతిరుగుదాడుల ఉధృతం గూడా తగ్గింది. మిత్రమండలి చేస్తున్న బ్రహ్మాండదాడి సన్నాహాలను విచ్ఛిన్నంచేసి, తూర్పునుంచి జర్మన్ గడ్డమీదికే వస్తున్న రెడ్‌ఆర్మీని ఎదుర్కోవాలని నాజీలు ఆశించారు. 15 రోజుల్లో కొన్ని ప్రదేశాల్లో 58 మైళ్ళవరకు ముందుకు త్రోసుకొచ్చారు. కాని మిత్రమండలిసైన్యాలు కట్టుదిట్టం చేయబడినయి. నాజీదాడి జయప్రదంగా ఎదుర్కొని అపివేయబడింది. దక్షిణాన లక్సెంబర్గులో బాస్టోన్ ప్రాంతంలో 16మైళ్లవరకూ జర్మన్లను వెనక్కుతరిమారు. ఆకాశంనుంచి మిత్రవిమాన దళాలు నాజీ కేంద్రాలను, సరఫరా మార్గాలను నాశనం చేస్తున్నాయి.

ఉత్తర ఇటలీలో ముందుకు వెళ్ళాలని జర్మన్లుప్రయత్నించారు. ఇదిగూడా విఫలమై, అన్ని వైపులనుంచి జర్మన్లకు ప్రమాదం హెచ్చుతోంది. హంగెరీలో రెడ్‌ఆర్మీయొక్క జయప్రదమైన వ్యూహం ఫలితంగా యుగోస్లావియా, ఇటలీలలో చిక్కుపడిన నాజీ సైన్యాలు వేరుచేయబడే ప్రమాదంహెచ్చింది.

ఈవిధంగా ఫాసిస్టుల వినాశం రోజురోజుకు దగ్గరపడుతోంది. జర్మనీ విజయం 6 నెలల్లోకి వచ్చిందని హిట్లరు జర్మన్ ప్రజలకు క్రిస్టమస్ సందేశం! ఇతరదేశాల ప్రజలమాట అలా ఉంచి, హిట్లర్ హంతకుని వాగ్దానాలనునమ్మే అంత పిచ్చివాళ్ళు జర్మనీలో గూడా లేరు ఈనాడు.

గ్రీసులో బ్రిటిష్ లొంగుబాటు

గ్రీకు ప్రజల ఐక్యత, బ్రిటిష్ ప్రజలయొక్క, ముఖ్యంగా బ్రిటిషకార్మికులయొక్క ఆందోళన, బహిరంగంగా చెప్పకపోయినా అమెరికన్, సోవియట్ ప్రభుత్వాలు బ్రిటిష్ వైఖరిపట్ల చూపిన విరసనభావం, మొండి చర్చిల్‌నుగూడా లొంగదీసినయి. చర్చిల్, ఈడెన్ గ్రీసుకు వెళ్ళవలసి వచ్చింది. ఎవరినైతే తిరుగుబాటుదార్లని, దోపిడిగాండ్రని నోటికివచ్చినట్లు ప్రేలాడో, వారి ప్రతినిధులనే రౌండుటేబిల్ సమావేశానికి పిలువవలసి వచ్చింది. గ్రీకు ప్రజలందరికీ వ్యతిరేకంగా బ్రిటిష్ ప్రభుత్వం బలపరచిన గ్రీసురాజు, పెపండ్రూ మంత్రివర్గం వైదొలగవలసి వచ్చింది. అన్నిపక్షాలూ అంగీకరించిన రిజెన్సీ సూచనకు ఒప్పుకోవలసి వచ్చింది.

ఇలాస్ సూచనలు

అయినప్పటికీ న్యాయమైన గ్రీసు ప్రజాపక్షసూచనలను బుద్ధిపూర్వకంగా అంగీకరించి, నిజమైనశాంతిపరిస్థితులను కల్పించుటకు చర్చిల్ ప్రభుత్వం ముందుకు రాలేదు. చర్చిల్, ఈడెన్ గ్రీసులో ఉండగా గ్రీసుదేశభక్తుల తరఫున 'ఇలాస్' చేసిన సూచనలు న్యాయసమ్మతమైనవని, వాటికి వ్యతిరేకంగా పెపెండ్రూ ప్రభుత్వాన్ని బలపరుస్తూ బ్రిటిష్ సైన్యం సహాయాన్ని ఇచ్చినంతకాలం, గ్రీసులో శాంతి ఏర్పడజాలదని బ్రిటిష్ కన్సర్వేటివ్‌పత్రికలే హెచ్చరించినాయి. 'ఇలాస్' తరఫున వియూన్డినాన్, పెరిస్టారిదిస్ సూచించిన షరతులు ఏమిటి?

(1) గ్రీకు మంత్రివర్గంలో నూటికి 40 నుంచి 60 వరకు స్థానాలు "ఇ.ఏ.యం." ప్రతినిధులకు ఉండాలి. దేశీయపాలన శాఖామంత్రి, న్యాయశాఖామంత్రి, విదేశాంగశాఖలో సహాయ కార్యదర్శి స్థానాలు ప్రజాపక్ష ప్రతినిధులకు ఉండాలి. (2) పోలీసు, ఇతర ప్రభుత్వ శాఖలనుంచి జర్మన్లతో సహకారం చేసిన ద్రోహుల నందరిని తొలగించి శిక్షించాలి. (3) గ్రీకు ప్రభుత్వ సైన్యాలను, గ్రీకు దేశభక్తదళాలను ఒకేసారిగా నిరాయుధులను గావించి నూతనంగా ఏర్పాటయే సర్వపక్ష ప్రభుత్వానికి ఆయుధాలు ఇచ్చివేయాలి. జాతీయసైన్యాన్ని నూతనప్రభుత్వం క్రింద తిరిగి పునర్నిర్మించాలి. (4) ప్రజాపక్షాలన్నిటితో కూడిన నూతన గ్రీకుప్రభుత్వం ఏర్పాటు చేయబడాలి. అందరికీ విశ్వాసంగల వ్యక్తియే ఈ ప్రభుత్వాధ్యక్షుడుగా ఉండాలి. (5) నూతనంగా ఏర్పాటయే ప్రభుత్వం క్రమేణా దేశంలో శాంతిపరిస్థితులను కల్గిస్తూ, షిబ్రవరిలో అంతర్జాతీయ ప్రతినిధుల యాజమాన్యంక్రింద రాజు పునఃప్రవేశాన్ని గురించి ప్లెబిసైట్‌ను తీసుకోవాలి.

గ్రీకురాజు వైదొలగి రిజన్సీ ఏర్పాటు చేసే విషయంలో అన్నిపక్షాలవారూ ఏకగ్రీవంగా ఆమోదించారు.

పై కోర్కెలు న్యాయసమ్మతమైనవని, వాటిద్వారా గ్రీసులో తిరిగి శాంతిపరిస్థితులు ఏర్పడగలవని అందరూ అంగీకరిస్తారు.

చర్చిల్ బెదిరింపులు

పై సూచనలను పెపెండ్రూ ప్రభుత్వం అంగీకరించలేదు. వాటిని అంగీకరిస్తే దేశాన్ని వదలిపెట్టి పోవలసివస్తుందని గ్రీకు ప్రభుత్వ సైన్యాధిపతి 'ప్లాస్టిరాస్' బెదిరించాడు. బ్రిటిష్ సైన్యాలమీద ఆధారపడిన గ్రీకురాజు, పెపెండ్రూమంత్రివర్గం 'ఇలాస్' సూచనలను అంగీకరించలేదు. గ్రీసులో సర్వపక్ష సమావేశం విఫలమయింది. కాని ఆ సమావేశంద్వారా గ్రీకుప్రజల న్యాయమైన కోర్కెలు ప్రపంచానికంతకూ వెల్లడి అయినాయి. ప్రపంచప్రజల సానుభూతిహెచ్చింది. చర్చిల్ ప్లానంతా భగ్నమవడానికి కొత్త అవకాశాలు కల్పించబడినాయి.

బ్రిటిష్ సైన్యాలు గ్రీసులో ఐక్యం కల్గించుకొనకపోతే, రక్తపాతం జరిగి ఉండేదనీ, తమ్ము ఇంతకాలం బలపరచిన మిత్రులను గెరిల్లా దళాల దయాదర్మాలకు వదలివేయలేమనీ, గ్రీసులోని అన్నిపక్షాలు సామరస్యానికి వచ్చేవరకూ బ్రిటిష్ సైన్యాలు గ్రీసు దేశభక్తుల దళాలతో యుద్ధం చేయక తప్పదనీ, సామరస్యం కుదరకపోతే అంతర్జాతీయ యాజమాన్యంక్రింద గ్రీసు పరిపాలన సాగించవలసివస్తుందని బెదిరించారు!

గ్రీసులో రక్తపాతానికి కారణమెవరు? 4 సంవత్సరాలు హిట్లరుతోపోరి తమ భవిష్యత్తును తాము నిర్మించుకొనుటకు ముందుకు వచ్చిన ప్రజలను అకస్మాత్తుగా నిరాయుధులనుచేయుటకు పూనుకున్న పెపెండ్రూ ప్రభుత్వాన్ని బలపరిచి, నిరాయుధులైన గ్రీకు స్త్రీల, బిడ్డలమీద కాల్పులు ప్రారంభించింది బ్రిటిష్, గ్రీసు ప్రభుత్వ సైన్యాలేనని అందరికీ తెలిసినదే.

సోవియట్ అంగీకారమా?

పైగా గ్రీసులో ప్రవేశించబోయేముందు అమెరికన్, సోవియట్ ప్రభుత్వాలకు తెలియజేయబడిందని చర్చిల్ ప్రభుత్వ వాదన. నాజీహంతకులను పరిమార్చుటకై నిర్ణయించబడిన యుద్ధవ్యూహం ప్రకారం ఎవ ఏ రంగంలో యుద్ధం సాగించాలో ... బడిందేగాని, గ్రీసులో దిగినతరువాత బ్రి... చర్యలకు సోవియట్, అమెరికన్ ప్రభుత్వా... అంగీకరించలేదు. గ్రీసు విముక్తి ... తరువాత జరిగిన కాండలో అమెరి... సోవియట్ సైన్యాలు బ్రిటిష్ సైన్యాలతో ... లేదని ఈడెన్ స్పష్టపరిచినందువల్లనే గ్రీసు... బ్రిటిష్ వైఖరిని అమెరికన్, సోవియ... ప్రభుత్వాలు సమర్థించుటలేదని ... తోంది.

పెపెండ్రూ రాజీనామా

అన్ని వైపులనుంచీ గ్రీసులో బ్రి... వైఖరి ఖండించబడింది. ఈ వత్తిడి ... తంగా రాజుకుబదులుగా ఆర్చిబిషప్ డెమా... నాస్ రీజెంటుగా నియమించ... పెపెండ్రూ ప్రభుత్వం రాజీనామా ఇచ్చి... డెమాస్కినాస్ క్రొత్త ప్రభుత్వాన్ని ఏర్పా... చేయుటకు ప్రయత్నిస్తున్నారు. ప... ప్రతినిధులతోగూడిన ప్రజాహిత ప్రభు... ఏర్పాటు చేయుటతో గ్రీసులో శాంతి ఏర... గలదు.

కాని 'డిమాస్కినాస్' ప్రజాపక్షం ... రికి హితుడని అనుకొనుట పొరపాటు. ... దేశభక్తులకు వ్యతిరేకులయిన ఇతనితో రి... ఏర్పాటు చేయాలని బ్రిటిష్ ప్రభుత్వం ... సంక్షోభపరిస్థితులు ఏర్పడకపూర్వమే ప్ర... త్నించిందని బ్రిటిష్ కమ్యూనిస్టుపార్టీ ... "డెయిలీ వర్కర్" హెచ్చరిస్తోంది. ... ఇటలీలో బడోగ్లియోవలెనే నెమ్మది... ఈయన గూడా ఐక్యప్రజా ఉద్యమం ము... తప్పుకునే సమయం వస్తుందని గుర్తింధ...

3 వారాల్లో ఐక్య గ్రీసు ప్రజలము... బ్రిటిష్ ప్లానులు భగ్నమయినాయి ... కారణాలు: (1) గ్రీకుప్రజల ఐక్యత. ... గ్రీసుప్రజలు ఫాసిస్టులకు వ్యతిరేకంగా ... దుతూ నిర్మించుకున్న ఐక్య ప్రజా ఉద్య... నికి అతిసూక్ష్మకాలంలో వచ్చిన ప్రప... ప్రజా సానుభూతి. (3) గ్రీసుప్రజలు ... వం సాగించినందువల్ల జయం పొంద... కొందరి అభిప్రాయం. ఇది కేవలం ... పాటు. గ్రీసులో జరిగింది అంతర్యుద్ధం... విప్లవమూ కాదు. ఐక్యప్రజా ఉద్యమా... విచ్ఛిన్నం చేయుటకై బ్రిటిష్ ప్రభుత... సాగించిన అఘాయిత్యాన్ని ఎదుర్కొని ... తను. ప్రజా ఉద్యమాన్ని రక్షించుకున్నా... జాతీయైక్యత ముందు సామ్రాజ్యవాదు... ప్లానులు ఎలా కూలిపోతున్నవో గ్రీ... ఉదంతం మరొకసారి హెచ్చరిస్తోంది.

కంభంపాటి సత్యనారాయ...
(జూనియర్)
1-1-45.

ప్రజాశక్తి
★
భారత కమ్యూనిస్టు పార్టీ
ఆంధ్ర కమిటీ పత్రిక
★
సంపాదకవర్గం:
మద్దుకూరి చంద్రశేఖరరావు (సం)
కంభంపాటి సత్యనారాయణ
పుచ్చలపల్లి సుందరయ్య
తుమ్మల వెంకటరామయ్య
చలసాని వాసుదేవరావు

Printed and Published by Katragadda Rajagopala Rao at Prajasakti Press, Governorpet - Bezwada.

END OF ISSUE